PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 76 | విజయవాడ, గురువారం 16 అక్టోబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Thusday 16 October 2025 | Rs







GST కార్ట్: మీరు ఎంత ఆదా చేశారో తెలుసుకోండి

GST 2.0 సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమం మరియు
అభివృద్ధి కార్యక్రమాల కోసం కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేస్తున్న..

గౌ॥ భారత ప్రధాని
శ్రీ నరేంద్ర మోదీ గారికి

గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
మరియు ఆంధ్ర రాష్ట్ర ప్రజల సహృదయ సుస్వాగతం!

16 అక్టోబర్ 2025, సాయంత్రం 4 గంటలకు రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ

ప్రధాని పాల్గొనే కార్యక్రమాలు

గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారిచే రూ.13,429 కోట్లు విలువైన ప్రాజెక్టుల
శంకుస్థాపన I ప్రారంభోత్సవాలు I జాతికి అంకితం

శంకుస్థాపనలు

- కర్నూలులో రూ.2,886 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులు
- కర్నూలు జిల్లా, ఓర్వకల్లులో రూ.2,786 కోట్ల పారిశ్రామిక కేంద్రం
- కడప జిల్లా, కొప్పర్తిలో రూ.2,136 కోట్ల పారిశ్రామిక కేంద్రం
- రూ.677 కోట్లతో చేపడుతున్న రైల్వే ప్రాజెక్టులు
- రూ.964 కోట్లతో చేపడుతున్న సబ్బవరం-షీలా నగర్ రోడ్డు

ప్రారంభోత్సవాలు

- రూ.1,142 కోట్లతో చేపట్టిన 6 రహదారి ప్రాజెక్టులు
- కృష్ణాజిల్లా, నిమ్మలూరులో రూ.362 కోట్లతో చేపట్టిన రక్షణ పరికరాల ఉత్పత్తి ప్రాజెక్టు
- రూ.200 కోట్లతో చిత్తూరులో చేపట్టిన ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్

జాతికి అంకితం

- రూ.546 కోట్లతో చేపట్టి పూర్తిచేసిన రైల్వే ప్రాజెక్టులు
- రూ.1,730 కోట్లతో నిర్మించిన 422 కి.మీ.ల శ్రీకాకుళం-అంగుల్ సహజ వాయు పైప్‌లైన్

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

జీఎస్టీ లాభాలకు ధన్యవాదాలు - ప్రధాని, ముఖ్యమంత్రి కృషికి అభినందనలు

సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులపై చర్యలు

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు పెట్టినా, వ్యక్తులు, వ్యవస్థల ప్రతిష్టకు భంగం కలిగించేలా దురుద్దేశాలను ఆపాదిస్తూ అసత్య ప్రచారం చేసినా కఠిన చర్యలు తప్పవని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తున్న వారిలో కొంత మందిని ఇప్పటికే గుర్తించామన్నారు. సోషల్ మీడియాను బాధ్యతగా వినియోగించుకోవాలని, మతం, వర్గ, ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టేలా పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు అనివార్యమని పేర్కొన్నారు. వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాలతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఫేక్ కంటెంట్ క్రియేట్ చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సామాజిక మాధ్యమాలు, నిర్మాణాత్మకమైన నిజాయతీతో కూడిన సమాచార మార్పిడికి వేదికగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పొట్టి శ్రీరాములు విగ్రహ నమూనా పరిశీలన

- స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్‌గా నామకరణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో 58 అడుగుల ఎత్తులో నిర్మించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ నమూనాను సిఎం చంద్రబాబు బుధవారం సచివాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్‌గా నామకరణం చేశారు. రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల్లో పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ స్మృతి వనానికి గత నెల 3న ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి నాటికి ఈ విగ్రహాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విగ్రహ నమూనా కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006


ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

గూగుల్‌క్లౌడ్‌తో అంతర్జాతీయ కనెక్టివిటీ కేంద్రంగా విశాఖ

- రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ మందలపు రవి



విజయవాడ : ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతిపెద్ద, దేశంలోనే తొలి ఎఐ హబ్‌ను గూగుల్‌క్లౌడ్ సంస్థ విశాఖలో ఏర్పాటుచేయటం ద్వారా ఈ డేటా సెంటర్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింతగా బలోపేతం కావటంతోపాటుగా వ్యవసాయం, వైద్యం, విద్యారంగాల్లో మరింత పురోభివృద్ధి సాధిస్తాయని రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ మందలపు రవి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాలకు నేరుగా కంప్యూటర్ డేటా పంపేందుకు, బ్రాడ్‌బ్యాండ్ వేగాన్ని పెంచేందుకు సముద్ర గర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటుచేస్తుందన్నారు. ఈ సబ్ సీ కేబుల్ నెట్‌వర్క్‌ను అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేసి దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డిజిటల్ ఆధారిత వ్యవస్థలకు గూగుల్ అనుసంధానం చేయనుందని వివరించారు.
అంతర్జాతీయస్థాయిలో విశాఖపట్టణం కనెక్టివిటీ కేంద్రంగా మారందని వివరించారు. గూగుల్ టెక్నాలజీ హబ్‌లోని ఎఐ టెక్నాలజీ గూగుల్ సెర్చ్, యూట్యూబ్, జీ మెయిల్, క్లౌడ్ వంటి ఇతర గూగుల్ సేవలు విశాఖ నుంచే ప్రపంచానికి అందించబడతాయని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ, ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్‌టిజిల శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన విశేషమైన కృషితో రాష్ట్రానికి గూగుల్ క్లౌడ్ సంస్థ రానుందని పేర్కొన్నారు.
2 లక్షల మందికి ఉపాధి కల్పించటంతోపాటుగా 1.33 లక్షల కోట్ల పెట్టుబడులను గూగుల్‌క్లౌడ్ సంస్థ పెడుతుందన్నారు. వైసిపి నేతలు గూగుల్‌క్లౌడ్ సంస్థకు భూములు ఇవ్వకుండా అడ్డుపడి ఆ సంస్థపై కూడా తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.



చింతూరు ఐటిడిఎ ఎదుట బైఠాయించిన పోలవరం నిర్వాసితులు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఐటిడిఎ ముట్టడి

- రామవరం నుండి భారీ ర్యాలీ
- తక్షణమే ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించాలని డిమాండ్



విఆర్.పురం మండలం రామవరం నుంచి ర్యాలీగా చింతూరు ఐటిడిఎకు వెళ్తున్న పోలవరం నిర్వాసితులు

ప్రజాశక్తి-విఆర్.పురం, చింతూరు (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలంలోని రామవరం గ్రామ పంచాయతీకి చెందిన పోలవరం నిర్వాసితులు బుధవారం చింతూరు ఐటిడిఎ కార్యాలయాన్ని ముట్టడించారు. దీనికి ముందు అఖిలపక్షం ఆధ్వర్యంలో రామవరం గ్రామం నుండి చింతూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏటా ముంపుతో అనేక ఆర్థిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులకు గురవుతున్నామని, ఈ ఏడాది ఆరుసార్లు వరద ముంచేసిందని, వేసిన పంటలు, నివాసాలు పూర్తిగా నాశనమయ్యాయని, తమకు వెంటనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీలకు తరలించాలని, భూమికి భూమి ఇవ్వాలని ప్లకార్డులు పట్టుకొని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఐటిడిఎ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. విఆర్ పురం మండలం రామవరం, గుర్రంపేట, మల్లె తోట గ్రామాల నుండి ఆదివాసీలు వందలాదిగా భారీగా తరలివచ్చారు.

చంటి పిల్లలను మహిళలు ఎత్తుకొని ఆందోళనలో పాల్గొన్నారు. ప్రతి కుటుంబానికీ రూ.10.50 లక్షలు పరిహారం అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న స్ట్రక్చర్ వేల్యూలన్నీ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళనకారుల వద్దకు కలెక్టర్ దినేష్ కుమార్ వచ్చి వినతి పత్రాన్ని తీసుకున్నారు. పోలవరం విషయంలో ప్రభుత్వానికి అన్ని విషయాలు వివరించామని నిర్వాసితులకు పరిహారం, పునరావాసం విషయాన్నీ గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్ చెప్పారు. మరలా నిర్వాసితుల డిమాండ్లను, వారి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పునరావాసం పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ, అఖిలపక్ష నాయకులు పులి బుజ్జి, బోధిబోయిన సురేష్, కారం సుందరయ్య, ఆసు లక్ష్మయ్య, వడ్లది రమేష్, కుంజ నాగిరెడ్డి, బొప్పెన రాజు, నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు, విలీన మండలాల ప్రజలు, ఆయా గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

మరో గిరిజన విద్యార్థి మృతి

- మృతదేహంతో ఆస్పత్రి వద్ద ప్రజా, విద్యార్థి సంఘాల ఆందోళన
- విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి : సిపిఎం



ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా ఏజెన్సీలో అనారోగ్యంతో విద్యార్థుల మరణాలు కొనసాగుతున్నాయి. ఇటీవల కురుపాంలో ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లకు గురై ఇద్దరు విద్యార్థినులు మృతి చెందగా, నాలుగు రోజుల క్రితం సాలూరు మండలం మామిడిపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న తాడంగి పల్లవి మరణించారు. తాజాగా మక్కువ మండలంలోని ఎర్ర చామంతలవలస ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి తాడంగి చిన్నారి (11) బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ విద్యార్థి స్వగ్రామం పనసభద్ర పంచాయతీ మూలవలస. ఈ నెల 13న బాలుడికి అనారోగ్యంగా ఉందని తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బంది సమాచారం ఇచ్చి ఇంటికి పంపించేశారు. శంబర పిహెచ్‌సికి, అక్కడి నుంచి సాలూరు ఏరియా ఆస్పత్రికి తల్లిదండ్రులు తరలించారు. వైద్యులు మలేరియాగా నిర్ధారించారు. జ్వరం తగ్గకపోవడంతో పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా మలేరియా లేదని ఇంటికి పంపించేశారు. ఇంటికి చేరుకున్న విద్యార్థి వాంతులు చేసుకోవడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కిడ్నీలో సమస్య ఉందని చెప్పి విశాఖ కెజిహెచ్‌కు రిఫర్‌చేశారు. విశాఖ తరలిస్తుండగా విద్యార్థి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మూల వలస గ్రామం వద్ద విద్యార్థి మృతదేహంతో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయశాంతి ఆ గ్రామానికి వెళ్లి చిన్నారి మృతదేహాన్ని సందర్శించారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆమె హామీ ఇచ్చారు. గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ అన్నారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం నాయకులు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు.



వీరవాసరం కేరళ డిజిపి ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులకు పౌరసన్మానం నిర్వహిస్తున్న గ్రామస్తులు

సాంస్కృతికంగా, సంఘపరంగా చైతన్యవంతమైన రాష్ట్రం కేరళ

- కేరళ డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్
- ఘనంగా పౌర సన్మానం

ప్రజాశక్తి - వీరవాసరం (పశ్చిమగోదావరి జిల్లా)

రాజకీయంగా, సాంస్కృతికంగా, సంఘపరంగా కేరళ చైతన్యవంతమైన రాష్ట్రమని ఆ రాష్ట్ర డిజిపి రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామస్తులైన ఆజాద్ చంద్రశేఖర్, సరిత దంపతులను ఆ గ్రామస్తులు బుధవారం స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘనంగా పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో పోలీస్‌గా ఉండడమంటే ఒక ఛాలెంజ్ అని తెలిపారు. ఆ పోలీస్‌గానే పారదర్శకంగా, మానవీయంగా, ప్రజల పక్షం ఉండే విధంగా ఉన్నానని, అందువల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. తనతోపాటు ఇదే ఎంఆర్‌ఎకె హైస్కూల్‌లో చదువుకున్న ఎంవి సుబ్బారెడ్డి, చికిలే సుభాకర్ ఆలిండియా సర్వీస్‌కు ఎంపికయ్యారని తెలిపారు. సుబ్బారెడ్డి త్రిపుర, సుభాకర్ సిక్కిం, తాను కేరళకు వెళ్లామని వివరించారు. నాడు తాము వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం బాధ అన్పించినా వీరవాసరం ఖ్యాతిని దేశం నలుమూలలా వ్యాపింపజేశామని సంతృప్తి దక్కిందన్నారు. వీరవాసరం నుంచి కేరళకు ఎవరు వచ్చినా తన అతిథులుగా భావిస్తానన్నారు. సభకు అధ్యక్షత వహించిన భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ వీరుల వాసం.. వీరవాసరం అని కొనియాడారు. విద్యార్థులంతా ఆజాద్ చంద్రశేఖర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తుని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ, మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలిపై రైలులో అత్యాచారం !

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి / అమరావతి బ్యూరో

రైలులో ప్రయాణిస్తున్న మహిళపై అత్యాచారం చేసి ఆభరణాలు దోచుకువెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి సంత్రగంచి ప్రత్యేక రైలులో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ జిఆర్‌పిఎఫ్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. రాజమండ్రి నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు మంగళవారం రాత్రి ఆమె సంత్రగంచి రైలు ఎక్కారు. గుంటూరు స్టేషన్‌లో బాధితురాలు కూర్చున్న భోగి నుంచి మహిళలందరూ దిగిపోయారు. ఆమె ఒక్కరే ఉండడంతో డోరు వేసుకున్నారు. రైలు కదులుతున్న సమయంలో ఆగంతక వ్యక్తి వచ్చి డోరు తీయమని బతిమిలాడుతూ సైగ చేశాడు. దీంతో ఆమె డోర్ తీయగా బోగిలోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న బాధితురాలిని కత్తితో బెదిరించి బంగారం, డబ్బులు హ్యాండ్‌బ్యాగ్, సెల్ ఫోన్ లాక్కొని ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పెదకూరపాడు స్టేషను రాగానే దోచుకున్న సొమ్ముతో నిందితుడు రైలు దిగి పారిపోయాడు. దీనిపై సికింద్రాబాద్ జిఆర్‌పిఎఫ్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

మహిళా బోగిలోకి పురుషులను ఎలా అనుమతిస్తారు?
మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ

రైళ్లలో మహిళలకు కేటాయించిన కోచ్‌లలో పురుషులను ఎలా అనుమతిస్తారని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ ప్రశ్నించారు. సంత్రాగచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్యాసింజర్‌పై గుంటూరు, పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన అత్యాచార ఘటనపై బుధవారం ఆమె స్పందించారు. ఈ ఘటన గురించి గుంటూరు, విజయవాడ డిఆర్ఎంలు, ఆర్‌పిఎఫ్ అధికారులతో మాట్లాడిన ఆమె చర్యల నిమిత్తం మహిళా కమిషన్ అధికారులను ఆదేశించారు. దీంతో కార్యాలయ అధికారులు.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో ఫోన్‌లో సంప్రదించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని పట్టుకుంటామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు ఆమెకు తెలిపారు.

డిఆర్ఎం, ఆర్‌పిఎఫ్ ఎస్‌పిలకు లేఖలు

ఈ ఘటనకు సంబంధించిన కేసుపై దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని శిక్షించాలని రాయపూడి శైలజ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె గుంటూరు, విజయవాడ రైల్వే డిఆర్ఎంలు, ఎస్‌పిలు, రైల్వే సెక్యూరిటీ ఫోర్స్‌లకు వేర్వేరుగా లేఖలు రాశారు. మహిళా కంపార్టుమెంట్లలో మహిళా కానిస్టేబుళ్లకు డ్యూటీలు వేయాలని, మహిళా కోచ్‌లలో ప్రయాణించడానికి, పురుషులను నిరోధించడానికి ఆర్‌పిఎఫ్ క్రమం తప్పకుండా డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. సంత్రాగచి ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన ఘటన దర్యాప్తు అనంతరం కమిషన్‌కు నివేదిక పంపాలన్నారు.

కోనసీమ జిల్లాలో దారుణం


- ఇద్దరు చిన్నారులను చంపి తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆలమూరు (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

ఇద్దరు కుమారులను చంపి, తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకపాడులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చిలకలపాడుకు చెందిన పావులూరి కామరాజు (36)కు భార్య నాగదేవి, కుమారులు అభిరామ్(11), త్రినాథ్‌గౌతమ్ (8) ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధల కారణంగా ఐదేళ్ల క్రితం నాగదేవి ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కామరాజుపై కేసు నమోదైంది. ఇటీవలే లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన సోదరుడికి మంగళవారం అర్ధరాత్రి వాట్సాప్‌లో సెల్ఫీ వీడియోకామరాజు పంపారు బుధవారం తెల్లవారుజామున పోలీసులు, కుటుంబసభ్యులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇద్దరు చిన్నారులకు ముందుగా పురుగుమందు పట్టించి తరువాత కామరాజు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని డిఎస్‌పి తెలిపారు.

బల్క్‌డ్రగ్ పార్క్ ఉద్యమకారులపై నిర్బంధం విడనాడాలి

- పలుచోట్ల నిరసనలు



రాస్తారోకోనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి - అనకాపల్లి జిల్లా యంత్రాంగం

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని చేపట్టిన ప్రజా ఉద్యమంపై ప్రభుత్వ నిర్బంధాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పలుచోట్ల బుధవారం నిరసనలు తెలిపారు. నర్సీపట్నం పెద్దబొడ్డేపల్లి మార్కెట్ యార్డ్ కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ, మాడుగుల మండలం గదబూరు, చీడికాడ మండలం కోనాం జంక్షన్, ఎస్.రాయవరం, రావికమతం మండల కేంద్రం, చీమలపాడు, పి కొట్నాబెల్లి, గర్నికం గ్రామం, దేవరాపల్లి, కశింకోట మండలం తాళ్లపాలెం, చోడవరం కొత్తూరు జంక్షన్, కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో ప్రజా,ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. పరవాడలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పర్యావరణానికి, ప్రజలకు నష్టం కలిగించే బల్క్‌డ్రగ్ పార్క్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బల్క్‌డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు.

టూరిజం డెస్టినేషన్‌గా సీమ : చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టూరిజం డెస్టినేషన్‌గా రాయలసీమను మార్చనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేడు (గురువారం) ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో టిడిపికి చెందిన ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ఎంపిలతో ఆయన బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విశాఖ పట్నంకు గూగుల్ రావడంతో ప్రధాని గూగుల్ రావడంలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, అశ్వనీ వైష్ణవ్‌ల చొరవ ఉందని, రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్ కూడా ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. రాయలసీమలోని తిరుపతి, శ్రీశైలం, గండికోట లాంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని సిఎం తెలిపారు. కర్నూలు సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. తిరుమల తర్వాత జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఉన్న క్షేత్రంగా శ్రీశైలం అభివృద్ధి చేస్తామన్నారు.

పొగాకు కంపెనీల ఆఫర్లకు దూరంగా ఉండాలి

- ప్రభుత్వ శాఖలకు వైద్యారోగ్యశాఖ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పొగాకు ఉత్పత్తిదారులు, కంపెనీల చిహ్నాలు, ప్రచారం ప్రభుత్వ శాఖల్లో లేకుం డా చూడాలని వైద్యారోగ్యశాఖ కోరింది. ఆయా సంస్థల భాగస్వామ్యంతో క్రీడలు, సాంస్కృతిక, ఇతర ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించొద్దని స్పష్టం చేసింది. ఈ అంశంపై విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యశాలలో వివిధ శాఖల అధికారులకు వైలట్ స్ట్రాటజీ సంస్థ ప్రతినిధులు శివంకపూర్, అమిత్ యాదవ్ మార్గదర్శకాలను వివరించారు. పొగాకు వాడకం తగ్గింపు చర్యల్లో భాగంగా పొగాకు ఉత్పత్తిదారులు, కంపెనీలతో స్పాన్సర్ షిప్ ఒప్పందాలు చేసుకోకూడదని, ఇతర నియంత్రణ చర్యలు పాటించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పొగాకు వాడకం వల్ల చాలా మంది ప్రజలు మరణిస్తున్నారని, దీనివల్ల ఓరల్ కేన్సర్, ఊపిరితిత్తులు, ఇతర అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. దేశ జనాభాలో 28 శాతం మంది పొగాకును ఏదో రకంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఈపూరు ప్రశాంత్, పంచాయతీరాజ్, పర్యాటక, మహిళా శిశు అభివృద్ధి, గిరిజన సంక్షేమం, విద్యాశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ప్రతి మామిడి రైతుకూ కిలోకు రూ.12 ఇవ్వాలి

- సహకరించని ఫ్యాక్టరీల లైసెన్స్ రద్దు చేయాలి
- 'రైతు ఆక్రందన' సభలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - చిత్తూరు (బంగారుపాళ్యం)

ప్రభుత్వం ప్రకటించి నట్లుగా ప్రతి మామిడి రైతుకూ కిలోకు రూ.12 ఇవ్వాలని వక్తలు ఉద్ఘాటించారు. మామిడి రైతులు చేసిన పోరాటం వల్లే ప్రభుత్వ సబ్సిడీని అందించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న గుజ్జు పరిశ్రమల లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మానంద ఆశ్రమంలో మామిడి సంఘం అధ్యక్షులు జనార్ధన్ ఆధ్వర్యంలో 'రైతు ఆక్రందన సభ' బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను మార్కెట్లో విక్రయించేటపుడు ధరను వ్యాపారి నిర్ణయించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో మామిడికి నిర్ణయించిన కిలోకు రూ.12 మద్దతు ధర చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సబ్సిడీ రూ.నాలుగు, గుజ్జు పరిశ్రమల నుంచి రూ.ఎనిమిది వసూలు చేసి మామిడి రైతులకు అందించాలని ఆక్రందన సభ నిర్ణయించినపుడు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందించడం హర్షించదగిన విషయమన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ మామిడి రైతులు ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు పి భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సమస్యల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, గుజ్జు ఫ్యాక్టరీలకే అండగా ఉంటోందని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ 2018 నుంచి రైతుసంఘాల ఆధ్వర్యంలో గుజ్జు ఫ్యాక్టరీల నిర్వాకంపై ఉద్యమిస్తూనే ఉన్నామన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ గుజ్జు ఫ్యాక్టరీల్లో తయారయ్యే పల్ప్‌ను స్థానిక దేవాలయాల్లో సందర్శకులకు, టిటిడి, ఇతర విద్యాసంస్థలకు సరఫరా చేస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం సాధ్యమవుతుందని తెలిపారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి హేమలత మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతుల సమస్యల పరిష్కారంలో అన్ని పార్టీల సహకారంతో సంఘటితంగా ఉద్యమిస్తున్నామన్నారు. మామిడిసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి జనార్ధన్, సి మనీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్రందన సభ అడ్డుకునేందుకు వారం రోజులుగా స్థానిక శాసనసభ్యులు తీవ్రంగా ప్రయత్నించారని, అయినా విజయవంతం చేసిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలో రూ.నాలుగు చొప్పున 75 కోట్లు మంజూరు చేయాలని, రూ.ఎనిమిది చొప్పున 150 కోట్లు మంజూరు చేయాలని తెలిపారు. అలాగే మూడు జిల్లాల పరిధిలోని నాలుగు లక్షల మంది రైతులకు రూ.370 కోట్లు వెంటనే మంజూరు చేయాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించిన గుజ్జు ఫ్యాక్టరీల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం ఉపాధ్యక్షులు బి మురళి, నాయకులు ఓబుల్‌రాజు, సురేంద్ర, శివారెడ్డి, సురేంద్ర, సంజీవరెడ్డి, మునిరత్నం నాయుడు, ఉమాపతినాయుడు, బి.శ్రీనివాసులు, రవి, చెంగల్రాయరెడ్డి పాల్గొన్నారు.

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 76 | విజయవాడ, గురువారం 16 అక్టోబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 16 October 2025 | Rs

కనీస పెన్షన్ పెంపు ఎప్పుడు.?

- ఇపిఎఫ్ఓ పింఛనుదారుల ప్రశ్న
- తాజా సిబిటి సమావేశంపై అసంతృప్తి
- కొత్త నిబంధనలపైనా విమర్శలు

7



9

2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం

- నిర్వహణ హక్కులు సొంతం
- నవంబర్ 26న అధికారికంగా ప్రకటన

'ఓపెన్'గా దోచుకోవడానికేనా?

- ప్రస్తుత ఖరీఫ్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి
- 50 లక్షల టన్నులే కొనాలని నిర్ణయం
- 40 లక్షల టన్నులను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవాలని రైతులకు సలహా

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వాతావరణ పరిస్థితులు కొంత అనుకూలించడంతో ఈ ఏడాది వరి పంట మంచి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, వచ్చిన పంటనంతటినీ కొనే అవకాశాలు లేవన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పంటలో 55 శాతం మేరకు కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మిగిలిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకోవాలని రైతులకు ఉచిత సలహా ఇస్తోంది. కొనుగోలు కేంద్రాలకు నిర్దేశించిన లక్ష్యం పూర్తయితే ఆ ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లులకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. దీనికి మద్దతు ధరపై ప్రభుత్వం బాధ్యతపడదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇచ్చి ధాన్యం తీసుకోవాలని మాత్రమే అధికారులు మిల్లర్లకు చెప్తారు. తేమ శాతం పేరుతో అదనంగా నాలుగైదు కేజీలు ధాన్యం తీసుకోవడం, క్వింటాకు రూ.250 నుంచి 300 వరకు ధర తగ్గించి ఇవ్వడం ఏటా రైతులకు అనుభవమే. ఈసారి ఆ పని అధికారికంగా చేసుకునేందుకు ప్రభుత్వమే మిల్లర్లకు లైసెన్స్ ఇచ్చినట్లయింది. రైతుల నుంచి ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామంటూ ఒకవైపు చెప్తూనే మరోవైపు బహిరంగ మార్కెట్లో



అమ్మకానికి ధాన్యం సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)

ధాన్యం అమ్ముకోవాలని రైతులకు సలహా ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. 2025 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందులో 50 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థతో పాటు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) ద్వారా లెవీ సేకరణ చేపట్టనున్నారు. ఇందులో ఎఫ్‌సిఐ ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర అనుమతించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ ద్వారా సేకరించనుంది. 2024 ఖరీఫ్‌లో ఎఫ్‌సిఐ 15.92 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయగా, ప్రస్తుత సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కేంద్రం అనుమతించింది. గతేడాది ఖరీఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్‌సిఐ కలిపి 31.52 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశాయి. అందులో ఎఫ్‌సిఐ 15.92 లక్షల మెట్రిక్ టన్నులపోను రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ ద్వారా మిగిలిన 15.60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రెట్టింపు చేసి ఉంటే 60 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని కొనే పరిస్థితి ఉండేది. ఎఫ్‌సిఐ కొనుగోలు చేస్తుందనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను పెంచకపోవడంతో రైతులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి రానుంది.

ఎపి, ఒడిశాల మధ్య వివక్ష

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎపి, ఒడిశా రాష్ట్రాలకు ధాన్యం లెవీ సేకరణ అనుమతిలో వివక్ష చూపుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒడిశాలోని బిజెపి ప్రభుత్వానికి 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ఎఫ్‌సిఐ ద్వారా 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అప్రూవల్ ఇచ్చినట్లు తెలిసింది. అదే ఎపిలోని టిడిపి కూటమి ప్రభుత్వానికి 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే ఎఫ్‌సిఐకి అనుమతి ఇచ్చింది. ఎపితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణం, దిగుబడి పరంగా తక్కువ ఉన్నా ఒడిశాకు అదనంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతించడం విమర్శలకు తావిస్తోంది.

ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీదేవి, సావిత్రి

- 57 మందితో రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీదేవి, కార్యదర్శిగా వి.సావిత్రి, కోశాధికారిగా డి.శ్రీనివాస కుమారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలుగా రమాదేవి, ప్రభావతిని ఎన్నుకున్నారు. సిహెచ్.రమణి, వై.సత్యవతి, షేక్ మస్తాన్ బి, పూర్ణ, సరోజ, కె.రమాదేవి, సాయి లక్ష్మి, శ్యామల, చంద్రిక కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా 43 మందిని ఎన్నుకున్నారు. మొత్తం 57 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది.

రాష్ట్ర కమిటీ సభ్యులు

రాష్ట్ర కమిటీ సభ్యులుగా పి.రమణమ్మ, బి.లక్ష్మి, ఎస్.హైమావతి, కుమారి, ఆర్ఎన్.మాధవి, కొండమ్మ, డి.వరలక్ష్మి, జి.భూలక్ష్మి, డి.ఆదిలక్ష్మి, దైవకృప, ఐ.పద్మావతి, శ్రీదేవి, ఉదయకుమారి, కె.పద్మజ, ఎ.శ్యామల, సరోజ, కుమారి, జి.ఝాన్సీ, ఎల్.అరుణ, కె.పద్మ, జి.రజని, అనూష, కె.రమాదేవి, షమ్మీ, టి.శివ కుమారి, షేక్ మున్వర్, ఈశ్వరి, ముంతాజ్, అలివేలు, అరుణ, పద్మ, శ్యామల, అశ్విని, జ్యోతి, శ్రావణి, అమలశ్రీ, టి.శ్రీదేవి ఎన్నికయ్యారు. రాజమండ్రి, అన్నమయ్య, కృష్ణ జిల్లాల రాష్ట్ర కమిటీ సభ్యులు తర్వాత ఎన్నికవుతారు.

జాతీయ మహాసభకు 30 మంది ప్రతినిధులు

పి.రమణమ్మ, బి.లక్ష్మి, వై.సత్యవతి, ఆర్ఎస్.మాధవి, డి.వరలక్ష్మి, ఎస్.హైమావతి, ఐ.పద్మావతి, ఆదిలక్ష్మి, కె.వరలక్ష్మి, పి.పూర్ణ, ఎస్.ఉదయకుమారి, ఏ.శ్యామలారాణి, కె.సరోజ, కె.రమాదేవి, ఎల్.అరుణ, జి.రజని, కె.మస్తాన్‌బి, టి.శివకుమారి, సాయిలక్ష్మి, ముంతాజ్, కె.అరుణ, శ్యామల, చంద్రిక, శ్యామల, అశ్విని, శ్రీదేవి, ఎం.శ్రీదేవి, డి.శ్రీనివాస కుమారి, సిహెచ్.రమణితో 30 మందిని జాతీయ మహాసభలకు ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. ప్రత్యామ్నాయంగా ఎం.భాగ్యమ్మ, టి.శ్రీదేవి, శ్రావణి ఉన్నారు.



ఐద్వా నూతన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి శ్రీదేవి, వి.సావిత్రి, శ్రీనివాసకుమారి



విశాఖ ఉక్కు రెండేళ్ల విద్యుత్ బకాయిలు రద్దు

- పదేళ్ల తరువాత ప్రభుత్వ వాటాగా మార్పు
- ఉత్తర్వులు జారీచేసిన పరిశ్రమలశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సంబంధించిన రెండు సంవత్సరాల బకాయిలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉక్కు ఫ్యాక్టరీ నష్టాలను ఎదుర్కుంటున్న నేపథ్యంలో ఆ సంస్థకు ఆర్థిక చేయూతను అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తాజా ఉత్తర్వుల ప్రకారం గత ఏడాది ఆగస్టు నుండి రెండు సంవత్సరాల పాటు విద్యుత్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. రద్దు చేసిన మొత్తం బకాయిల విలువ 2,400కోట్ల రూపాయలుగా ఉత్తర్వులలో పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్లాంటు యాజమాన్యం నుండి అందిన పలు వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రద్దు చేసిన మొత్తాన్ని భవిష్యత్తులో ప్రభుత్వ వాటాగా బదలాయించనున్నారు. ఈ మొత్తాన్ని 7 శాతం వడ్డీతో పదేళ్ల తరువాత విశాఖ ఉక్కులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మార్చనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 753 కోట్ల బదలాయింపు ఛార్జీలు కూడా ఈ మొత్తంలోనే ఉంటాయి. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎపిఇపిడిసిఎల్, ఇంధన శాఖ, విశాఖ ఉక్కు సంస్థలకు ప్రభుత్వం సూచనలు చేసింది.

పూర్తిగా రద్దు చేయాలి

స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి

ప్రజాశక్తి- ఉక్కునగర్ (విశాఖ)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ విద్యుత్ బకాయిలను పూర్తిగా రద్దు చేయాలని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ బకాయిలు రద్దు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ షేర్లను ఎపిఇపిడిసిఎల్‌కు కేటాయించాలనుకోవడం సరైంది కాదని తెలిపారు. మిట్టల్ వంటి ప్రైవేట్ సంస్థలకు రూ.వేల కోట్లు సబ్సిడీ ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు... ఒక ప్రభుత్వరంగ సంస్థకు బకాయిలు రద్దు చేయడం కష్టం కాదని తెలిపారు. నేరుగా విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఉన్న బకాయిలను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు కర్నూలులో మోడీ పర్యటన

- రూ.13 వేల కోట్ల పాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభాలు
- శ్రీశైలంలో దర్శనం - జిఎస్‌టిపై బహిరంగ సభ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం పర్యటించనున్నారు. రూ.13 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉదయం 10 గంటలకు ప్రధాని చేరుకుంటారు. అక్కడి నుంచి సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుని రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం వస్తారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం నన్నూరు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని రాగమయూరి వద్ద ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ సభలో పాల్గొనున్నారు. ఈ సభ నుంచి పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తయిన పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. కర్నూలులో రూ.2,886 కోట్లతో అదనపు పునరుత్పాదక ఇందన ఉత్పత్తి ప్రాజెక్టులు, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ.2,786 కోట్లతో పారిశ్రామిక కేంద్రం, కడప జిల్లా కొప్పర్తిలో రూ.2,136 కోట్లతో పారిశ్రామిక కేంద్రం, కొత్తవలస-విజయనగరం మధ్య రూ.493 కోట్లతో చేపట్టే నాలుగో రైల్వే లైన్, పెందుర్తి-సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య రూ.184 కోట్లతో నిర్మించే రైల్వే వంతెన, సబ్బవరం నుంచి షీలానగర్ వరకు రూ.961 కోట్లతో నిర్మించే ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.546 కోట్లతో పూర్తిచేసిన రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. శ్రీకాకుళం-అంగుల్ మధ్య 422 కిలోమీటర్ల మేర రూ.1,733 కోట్లతో నిర్మించిన పైప్‌లైన్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. కృష్ణా జిల్లా నిమ్మలూరులో రూ.362 కోట్లతో చేపట్టిన రక్షణ పరికరాల ఉత్పత్తి ప్రాజెక్టును, చిత్తూరు జిల్లాలో రూ.200 కోట్లతో చేపట్టిన ఇండేన్ బాట్లింగ్ ప్లాంటును, పీలేరు-కల్లూరు సెక్షన్‌లో భాకరాపేట వరకు నాలుగు వరుసల రహదారిని, కడప, నెల్లూరు సరిహద్దు నుంచి సిఎస్ పురం వరకు విస్తరించిన రెండు వరుసల హైవేను, గుడివాడ-నూజెల్ల రైల్వే స్టేషన్ల మధ్య గుడివాడలో ఎన్‌హెచ్-165పై నిర్మించిన వంతెన, ముద్దనూరు-కడప హైవేలో కమలాపురం వద్ద పాపాఘ్ని నదిపై నిర్మించిన వంతెనను, కనిగిరి బైపాస్, అనంతపురం-కళ్యాణదుర్గం-రాయదుర్గం హైవేలో బెళుగుప్ప మండలం ఎన్.గుండ్లపల్లి వద్ద బైపాస్‌ను ప్రారంభించనున్నారు. మోడీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొనున్నారు. మోడీ పర్యటన బందోబస్తులో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా సూచించారు. బందోబస్తు విధులు నిర్వహించే ఐపిఎస్ అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. 7500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రధాని మోడీ ప్రసంగించనున్న సభావేదిక



ప్రదర్శన అగ్రభాగాన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు పి.రామచంద్రయ్య ,ఎస్‌యుసిఐ నాయకులు రాఘవేంద్ర, సిపిఐఎంఎల్ నాయకులు

మోడీ మోసకారితనాన్ని శ్రీశైల మల్లన్న కూడా క్షమించడు

- కార్పొరేట్ల మేలు కోసమే జిఎస్‌టి సంస్కరణలు : వి శ్రీనివాసరావు
- కర్నూలులో వామపక్షాల ఆధ్వర్యాన 'మోడీ గో బ్యాక్' నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి


ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్రీశైలానికి వెళున్నారని, మోడీ మోసకారితనాన్ని శ్రీశైల మల్లన్న కూడా క్షమించడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. మోడీ కర్నూలు జిల్లా పర్యటనను వ్యతిరేకిస్తూ కర్నూలులో వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం 'మోడీ గో బ్యాక్' నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పరిషత్తు నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన రాజ్‌విహార్, బుధవార పేట మీదుగా కలెక్టరేట్ వరకూ సాగింది. వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలు, నల్లరిబ్బన్లు, నల్లచొక్కాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ గో బ్యాక్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి, ప్రత్యేక హోదా అమలు చేయాలి, కడప ఉక్కు నిర్మాణం చేపట్టి యువతకు ఉపాధి కల్పించాలి అంటూ నినాదాలు చేశారు. ప్రదర్శన అనంతరం కలెక్టరేట్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

మిగతా 7లో

బాలసరస్వతి కన్నుమూత

- తొలి తెలుగు నేపథ్య గాయనికి పలువురి నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలుగులో తొలి నేపథ్య గాయని రావు బాలసరస్వతి (97) బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఆమె రెండవ కుమారుని ఇంటిలో శ్వాస సంబంధిత అనారోగ్యంతో మరణించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం మహా ప్రస్థానంలో ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆరేళ్ల వయస్సు నుంచి బాలసరస్వతి పాటలు పాడటం ఆరంభించారు. తెలుగు కన్నడ తమిళ హిందీ సినిమాలలో సుమారు రెండు వేల పాటలు పాడారు. నటిగానూ కొన్ని సినిమాలలో నటించారు. రాజా వంశీకునితో వివాహం తరువాత సినీ రంగానికి దూరమయ్యారు. ఆమెకు ఇద్దరు కుమారులు. ఆమె పాడిన దేవదాసు సినిమాలో 'తానే మారేనా', 'అందం చూడవయా ఆనందించ వయ' రొమాంటిక్ పాటలు 'ధరణి కి గిరి భారమా గిరికి తరువు భారమా', 'పాపాయి నవ్వాలి' వంటి సున్నిత గీతాలు ఆలపించారు. తొలితరం నేపథ్య గాయని మృతికి పలువురు నివాళులర్పించారు.

పథకాల అమలుపై క్షేత్రస్థాయి తనిఖీలు

- ఆర్‌టిజిఎస్ సమీక్షలో సిఎం


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలుకు సంబంధించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఆర్‌టిజిఎస్‌పై బుధవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ నెల నుండి చేపట్టనున్న ఈ తనిఖీల్లో సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయో తెలుసుకోవడం ముఖ్య లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నట్లు, సుస్థిర విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిఎస్‌టి తగ్గింపు తరువాత ప్రజల నుండి అందిన ఫీడ్‌బ్యాక్‌ను ఈ సందర్భంగా సిఎం పరిశీలించారు. నిత్యావసరాలు, ఇతర వస్తువులపై పన్నులు తగ్గిన అంశాలపై గిరిజన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. దీపావళి పండుగ తరువాత కూడా సూపర్ జిఎస్‌టి ద్వారా పన్నుల తగ్గింపు, తద్వారా ధరలు తగ్గిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. జిఎస్‌టి 2.0పై కలిగే ప్రయోజనాలను సినిమా థియేటర్లలోనూ ప్రదర్శించాలని సూచించారు. అలాగే వన్‌గవర్నమెంటు వన్ సిటిజన్ విధానంలో ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని, వివిధ శాఖలు అందించే సేవలపై టెక్నాలజీ డేటా ఆడిటింగ్ ద్వారా సంతృప్తస్థాయిని అంచనా వేస్తామని సిఎం తెలిపారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు అధికారులు ఇచ్చే సమాచారానికి పొంతన ఉండాలని తెలిపారు. సామాన్యుడికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సిఎం వెల్లడించారు. నవంబరు మొదటి వారంలో కలెక్టర్ల పనితీరుపై మదింపు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని అంశాలను రాజకీయంగా వినియోగించుకుని నేరాలు చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ తరహా వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఎం తెలిపారు. ఈ సమీక్షకు సమాచారపౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఐటి, ఆర్‌టిజిఎస్, ఎక్సైజ్, జలవనరులశాఖ అధికారులు హాజరయ్యారు.

ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ : దీపావళి నేపథ్యంలో ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు బుధవారం అనుమతించింది. ఈ నెల 18 నుంచి 20 వరకూ నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్ఇఇఆర్ఐ), పెట్రోలియం-పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పిఇఎస్ఒ)లు ఆమోదించిన గ్రీన్ కాకర్స్ అమ్మకాలు, వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతించింది. అయితే ఈ నెల 19, 20 తేదీల్లో బాణాసంచా వినియోగాన్ని ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ, రాత్రి సమయంలో 8 నుంచి 10 గంటల వరకూ మాత్రమే సిజెఐ బిఆర్ గవాయ్, జసిస్ట్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం పరిమితం చేసింది. అలాగే, షరతులతో ఇచ్చిన ఈ అనుమతి వాయు కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలతో భాగస్వామ్యం కాగలదా అనే విషయాన్ని పరిశీలించడానికి ఒక పరీక్షా సమయంగా ధర్మాసనం వర్ణించింది. అదేవిధంగా ఈ నెల 14 నుంచి 25 వరకూ ప్రతిరోజూ వాయు నాణ్యతా సూచిక(ఎక్యూఐ) వివరాలతో నివేదికను సమర్పించాలని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి), సంబంధిత రాష్ట్రాల కాలుష్య నియంత్రణ బోర్డులను సుప్రీంకోర్టు ఆదేశించింది. కాగా, ఐదు నెలల క్రితం ఢిల్లీలో యావత్తూ బాణాసంచాను నిషేధాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.



పూరణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎ బేబీ, బివి రాఘవులు, తదితరులు

పూరణ్ కుమార్ ఆత్మహత్యపై న్యాయ విచారణ

- ప్రధాని మోడీకి సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ లేఖ
- పూరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రతినిధి బృందం

న్యూఢిల్లీ : హర్యానా ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ లేఖ రాశారు. కొంతమంది అధికారుల చేతుల్లో కుల వివక్షను, వేధింపులను ఎదుర్కొన్నానని పేర్కొంటూ పోలీసు అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనపై తాము తీవ్రంగా ఆవేదన, ఆందోళన చెందుతున్నామని ఈ లేఖలో బేబీ పేర్కొన్నారు. హర్యానా ఎడిజిపి పూరణ్ కుమార్ ఆత్మహత్య

మిగతా 7లో

సంపాదకీయం

'ఆ' భూములూ ఇవ్వాలి

కాకినాడ సెజ్ కోసం రైతుల నుండి బలవంతంగా తీసుకున్న భూములను వాటి సొంతదారులకు తిరిగి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగినది. ఈ నిర్ణయం వల్ల 2,180 ఎకరాలకు చెందిన 1,551 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కార్పొరేట్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా భూములు గుంజుకుంటున్న సమయమిది! రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని భూములపై సైతం కార్పొరేట్లు కన్నేశారు. పాలకులు వారికే కొమ్ము కాస్తుండటంతో భూదోపిడి విచ్చలవిడిగా సాగుతోంది. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడానికి వెనుక కాకినాడ సెజ్ బాధిత రైతాంగం ఏళ్ల తరబడి సాగించిన పోరాట కోణం, బెదిరింపులకు, ప్రలోభాలకు లొంగని స్థైర్యం ఉంది. నయానా, భయానా మాట వినని రైతుల బ్యాంకు ఖాతాల్లో ఏకపక్షంగా డబ్బు డిపాజిట్ చేసి భూములను స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, ఆ మొత్తంలో ఒక్క రూపాయిని కూడా తాకని అన్నదాతల ఆత్మగౌరవం, పట్టుదల ఉన్నాయి. 2003లో పరిశ్రమల పేరుతో సేకరించిన ఈ భూములు నిరుపయోగంగా ఉండిపోయాయి. అప్పటి ప్రభుత్వాలు పెట్టుబడులు వస్తాయని, ఉద్యోగాలు వస్తాయని, త్వరలో అభివద్ధి జరుగుతుందని హామీలు ఇచ్చినా అవి నెరవేరలేదు. రైతులు తమ పంట భూములు, జీవనాధారాలు కోల్పోయి ఆర్థికంగా కుంగిపోయారు. అయినా, వారి పోరాటం కొనసాగడంతో నిరుపయోగంగా ఉన్న భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులు విడుదలైనప్పటికీ, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఆగిపోయిన ఆ ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడం మంచి పరిణామం. అయితే, తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లోనూ ఈ ప్రక్రియను కొందరికే పరిమితం చేయడం బాధాకరం! ఎటువంటి అవార్డు ప్రకటించకుండా నాలుగు వేల ఎకరాలకు పైగా భూములను కాకినాడ సెజ్ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ భూముల రైతులను విస్మరించడం సబబుకాదు. వాటిని కూడా వెనక్కి ఇవ్వాలి.

పరిశ్రమల పేరిట రైతాంగం నుండి బలవంతంగా గుంజుకున్న భూములు నిరుపయోగంగా బీళ్లు పడి ఉండటం ఒక్క కాకినాడ సెజ్‌కే పరిమితం కాదు. నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, చిత్తూరు, అనకాపల్లి ఇలా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ వేలాది ఎకరాల్లో ఇదే స్థితి. పరిశ్రమల పేరిట వేలాది ఎకరాల భూమిని సంపన్నులు కబ్జా చేస్తున్నారు. పైగా వాటికి ల్యాండ్ బ్యాంకులని పేరుపెట్టి పెత్తనం చలాయిస్తున్నారు. ప్రభుత్వాలు వారికి తాబేదార్లుగా వ్యవహరించడం తగదు. ఇంత పెద్ద ఎత్తున ఖాళీ భూమి ఉన్నా ఇంకా వివిధ పేర్లతో భూములను సేకరించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తూనే ఉండటం, రైతులు ప్రతిఘటిస్తుండటం గమనార్హం. గత ఏడాది గణాంకాల ప్రకారమే రైతుల నుండి సేకరించిన భూములు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సెజ్‌లో దాదాపు ఐదు వేల ఎకరాలు, తిరుపతి జిల్లాలో ఆరువేల ఎకరాలు, కర్నూలులో 3,800, కడపలో మూడు వేల ఎకరాల భూములు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే, ఏదో ఒక పేరుతో భూసేకరణ జరగని జిల్లానే లేదు. అతి కొద్ది చోట్ల మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఈ తరహా భూములు నిరుపయోగంగానే ఉన్నాయి.

సిరులు పండించాల్సిన భూములు నిరుపయోగంగా పడి ఉండటం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చేటు. పభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్ర వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న భూములన్నింటిని రైతులకు వెనక్కి ఇవ్వాలి. ఈ మేరకు దశాబ్దాల కాలం నుండి సేకరించిన అన్ని రకాల భూములపైన ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలి. వాటిలో పరిశ్రమలు ఏర్పాటైనవి, నిరుపయోగంగా ఉన్న భూముల జాబితాను జిల్లాల వారీగా పారదర్శకంగా ప్రకటించాలి. ఖాళీగా ఉన్న భూములన్నింటిని ఎటువంటి రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, పన్నులు లేకుండా భూ యజమానులకు తిరిగి అప్పగించాలి. బీడుబడిన భూములు పంటలతో పచ్చదనం పులుముకోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడమే కాదు. గ్రామీణ జీవన విధానంలో స్థిరత్వం తీసుకువస్తాయి. సామాజిక న్యాయ సాధనకు బాటలు వేస్తాయి. ఒత్తిళ్లకు లొంగకుండా, సమిష్టిగా నిర్వహించే పోరాటాలే హక్కుల సాధనకు మార్గమన్న అంశాన్ని కాకినాడ సెజ్‌లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరోసారి ధృవపర్చింది. అటువంటి పోరాటాలను బలోపేతం చేయడమే ప్రజాతంత్ర శక్తుల కర్తవ్యం.

మంచి మాట



ప్రతి దాంపత్యంలోను రెండు వైవాహిక జీవితాలు వుంటాయి. ఒకటి ఆమెది. రెండు అతనిది. అతనిది ఎప్పుడూ ఆమె దానికంటే మెరుగ్గా వుంటుంది.

- జెస్సీ బెర్నార్డ్,
సామాజిక శాస్త్రవేత్త.

చైనా ఉన్నతిని గుర్తిస్తున్న ప్రపంచం

విశ్లేషణ



యం.ఎ.బేబి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల మీద టారిఫ్ ఉగ్రవాదంతో ఎడాపెడా దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. చైనా మాత్రం తొణుకూబెణుకూ లేకుండా అమెరికాను ప్రతిఘటిస్తూ తమ దేశ ప్రయోజనాల కోసం నికరంగా నిలబడింది. చైనా పటిష్ట ఆర్థిక వ్యవస్థ, చైనా కమ్యూనిస్టు పార్టీ రాజకీయ దృక్పథం ఇందుకు ఎంతగానో తోడ్పడ్డాయి. అంతర్జాతీయ పరిస్థితులతో పాటు ఆసియాలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న చైనా, భారత్‌ల మధ్య నెలకొన్న పరిస్థితులను కూడా ఇరు పార్టీల ప్రతినిధి బృందం చర్చించింది.

చైనా, యావత్ ప్రపంచ దేశాలూ అసాధారణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సి.పి.ఐ(యం) ప్రతినిధి బృందం చైనాలో పర్యటించింది. ఆరుగురు ప్రతినిధులతో కూడిన మా బృందం సెప్టెంబరు 23 నుండి 30 వరకు ఆ దేశ రాజధాని బీజింగ్‌తో పాటు హుబెయో, ఝెజియాంగ్ ప్రావిన్స్‌లను సందర్శించింది.

నేను 40 ఏళ్ళ క్రితం, 1985లో తొలిసారిగా చైనాలో జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సుకు హాజరయ్యాను. ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలో మరలా చైనాలో అడుగు పెట్టిన నేను ఆ దేశంలో చోటు చేసుకున్న మార్పులు చూసి ఆశ్చర్యపోయాను. బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్‌లో 'నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' (జాతీయ కళా ప్రదర్శనా వేదిక) పేరిట భూగర్భంలో నిర్మించిన సాంస్కృతిక రంగస్థల సమాహార వేదిక ఆసియాలోనే అతి భారీ కట్టడంగా పేరొందింది. స్థానికంగా ఈ కాంప్లెక్స్‌ను 'జెయింట్ ఎగ్'గా పిలుచుకుంటారు. అద్భుతమైన శిల్ప కళా నైపుణ్యంతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒకేసారి నాలుగైదు భారీ ఇవెంట్లు నిర్వహించుకోవచ్చు. మౌళిక సౌకర్యాల అభివృద్ధిలోని సృజనాత్మకత, సాంస్కృతిక వైభవాలకు ఇది అద్దం పడుతుంది. గతంలో పర్యటించినప్పుడు ఇక్కడ చుట్టు పక్కల పరికిస్తూ ఉండిపోయాను. ఈసారి మాత్రం వయోలిన్, గిటార్‌ల వీనుల విందైన కచేరీని ఆస్వాదించాం.

2021 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్ళు అయ్యింది. ఈ శత వార్షిక సంబరాల్లో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ అమలు చేసిన భారీ ప్రజా సంక్షేమ కార్యక్రమాన్ని యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నది. ప్రపంచబ్యాంకు నిర్వచనం ప్రకారం దారిద్య్రరేఖకు దిగువన ఉన్న 80 కోట్ల ప్రజానీకాన్ని చైనా పైకి తీసుకు వచ్చింది. ఈ స్ఫూర్తితోనే కేరళలో సి.పి.ఐ(యం) నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం కూడా దుర్భర దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న ప్రజలను పైకి తీసుకురావడానికి వివిధ అభ్యుదయ కార్యక్రమాలను అమలు చేసిన తీరును గుర్తు చేసుకోవడం సందర్భోచితమని భావిస్తున్నాను. ఈ ఏడాది నవంబర్ నాటికి మన దేశంలో దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలుస్తుంది.

చైనా కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది జులై 15న బీజింగ్‌లో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఒక దేశ చరిత్రను, పార్టీ చరిత్రను సునిశితంగా ఎలా ప్రదర్శించవచ్చనే దానికి మ్యూజియమ్‌ను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కాలం నుండి ఆధునిక కాలం వరకూ వందేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలను కళ్ళకు కట్టినట్లు డిజిటల్ రూపంలో ప్రదర్శించారు.

చైనాను సామ్రాజ్యావాద, వలస పాలన నుండి విముక్తి చేసేందుకు సాగించిన పోరాటాన్ని, వివిధ దశలలో అనుసరించిన వ్యూహాలను, ఎత్తుగడలను ఆది నుండి తుది వరకు సచిత్ర రూపంలో ప్రదర్శించారు. మావో జెడాంగ్ నాయకత్వం...కుమింటాంగ్‌తో పొత్తు, 1927 తర్వాతి కాలం నాటి చీలిక, పోరాటాలు, లాంగ్ మార్చ్, ఆశేష త్యాగాలు, సమరశీల పోరాటాల ద్వారా సాధించిన విప్లవ విజయం, డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన చేపట్టిన ఆధునీకరణ చర్యలు, జియాంగ్ జెమిన్, హుజింటావో నాయకత్వాన కొనసాగిన ఆధునీకరణ పర్వం, 2012 నుండి సీ జిన్‌పింగ్ నాయకత్వాన పార్టీ, దేశం పురోగమిస్తున్న వర్తమాన దశను ఇందులో పొందుపరిచారు.

ఈ మ్యూజియంలో 4,548 వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. కార్ల్‌మార్క్స్ బ్రసెల్స్ నోట్‌బుక్, చైనా రిపబ్లిక్‌ను ప్రకటించిన రోజున మావో ధరించిన కోటు, టోపీ, మావో చేతి రాత ప్రతులు, కమ్యూనిస్టు ప్రణాళికను చెన్ వాంగ్టో చైనా భాషలోకి అనువదించిన ప్రతి, లాంగ్ మార్చ్ సందర్భంగా ధరించిన బెల్ట్‌లు, చైనా సైన్యం అమెరికా 31వ పదాతి దళాన్ని ఓడించి కైవసం చేసుకున్న అమెరికన్ జాతీయ జెండా వంటివి చూశాం.

మా పర్యటన సందర్భంగా అనేక ద్వైపాక్షిక చర్యలు చోటు చేసుకున్నాయి. అన్నింటిలోకి చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు 'లీ షులేయ్' నాయకత్వాన ఉన్న ప్రతినిధి బృందంతో సాగిన చర్యలు ప్రముఖమైనవి. చైనా కమ్యూనిస్టు పార్టీ - సి.పి.ఐ.(యం), ఇరు పార్టీల మధ్య ఉన్న దీర్ఘకాలిక ధృఢ సంబంధాలను కొనసాగించాలన్న అభిప్రాయం ఈ చర్చల్లో వచ్చింది. ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచ దేశాల మీద, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణాది దేశాల మీద తన ఆధిపత్యాన్ని రుద్దడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ఇరు పార్టీలూ గమనంలో ఉంచుకుని, ఈ ప్రయత్నాలను నిలవరించడానికి భుజం భుజం కలిపి నిలబడాలన్న ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సందర్భంగా తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్స్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన విషయాన్ని గమనంలోకి తీసుకున్నది.



భారత్ - చైనా దేశాల మధ్య రాయబార సంబంధాలు నెలకొని 75 ఏళ్లు కావొస్తున్న సందర్భం ఇది. షాంఘై కోఆపరేషన్ వేదికతో పాటు బ్రిక్స్ కూటమిలో కూడా రెండు దేశాలూ వాటి వంతు పాత్ర పోషిస్తున్నాయి. రాబోయే కాలంలో భారత్, చైనాలు వంతుల వారీగా బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని నిర్వహించనున్నాయి. భారత్ - చైనాలు చర్చల ద్వారా రెండు దేశాల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవాలని చైనా కమ్యూనిస్టు పార్టీ సిపిఐ(ఎం) ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడడం ఇరు దేశాలకూ లాభదాయకం కావడంతో పాటు ప్రపంచ శాంతికి, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది కాబట్టి ఇరు దేశాలూ సరిహద్దుల వద్ద నెలకొన్న ఉద్రిక్తతలను ఉపశమింపచేయడానికి ఓపికగా కృషి చేయాలని ఇరు పార్టీల ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. మేం ఈ పర్యటనలో ఉన్న సందర్భంలోనే ఆ దిశగా ఆశాజనకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందులో భాగంగానే చైనా-భారత్‌ల మధ్య ప్రత్యక్ష విమానయానానికి ఇరు దేశాలూ అంగీకారానికి వచ్చాయి.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల మీద టారిఫ్ ఉగ్రవాదంతో ఎడాపెడా దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. చైనా మాత్రం తొణుకూబెణుకూ లేకుండా అమెరికాను ప్రతిఘటిస్తూ తమ దేశ ప్రయోజనాల కోసం నికరంగా నిలబడింది. చైనా పటిష్ట ఆర్థిక వ్యవస్థ, చైనా కమ్యూనిస్టు పార్టీ రాజకీయ దృక్పథం ఇందుకు ఎంతగానో తోడ్పడ్డాయి. అంతర్జాతీయ పరిస్థితులతో పాటు ఆసియాలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న చైనా, భారత్‌ల మధ్య నెలకొన్న పరిస్థితులను కూడా ఇరు పార్టీల ప్రతినిధి బృందం చర్చించింది.

మా ప్రతినిధి బృందం మావో జెడాంగ్ భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించింది. సందర్శకుల సందేశాల పుస్తకంలో సిపిఐ(ఎం) తరపున కొన్ని వాక్యాలు రాయడం గొప్ప అనుభూతిని మిగిల్చింది. మావో జెడాంగ్ తదితర నేతల నాయకత్వంలో చైనా కామ్రేడ్స్ ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు...ఎర్రజెండా చేపట్టి ఈ ప్రపంచాన్ని దోపిడీ నుండి విముక్తి చేయడానికి...పోరాడే వారందరికీ నిరంతర స్ఫూర్తినిస్తాయి.

(వ్యాసకర్త సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి)

ఉప్పిండి కంటే ఊర్మిండి ఖర్చెక్కువ

సెటైర్

రాజొస్తున్నాడు, మా ఊరికి రాజొస్తున్నాడు. నిజంగానే మేమెంతో అదృష్టవంతులం. ఎందుకంటే స్థానిక రాజుతో పాటు హస్తినాపుర సింహాసాధిపతి స్వయంగా మా ఊరొస్తున్నారు. ఏ పార్టీ వారైనా ప్రధాన మంత్రి ప్రధానమంత్రే. అందుకే ఆయనకు స్వాగతం సుస్వాగతం.

అసలు మొదటి ప్రధానమంత్రి నెహ్రూ కూడా మా ఊరొచ్చిపోయారని ఫోటోల్లో చూశాం. సహజంగానే ఆయన కాలేజీలు, విద్యా సంస్థలు లాంటి స్థలాలు వెళ్తారని అందరికీ తెలుసు. అవి అభినవ దేవాలయాలన్నాడాయన. అది పాత కాలం అనుకోండి. ఇప్పటి పరిస్థితులు మారాయి. తరువాత ఇందిరమ్మ కూడా వచ్చారు. ఆమె కూడా ఓపెన్ టాప్ జీపులో పోయినట్టు గుర్తు. తరువాత మొరార్జీ దేశాయ్! ఆయనా అంతే! ఇంకా సింపుల్ మనిషి. జీపులో పోతూ అందరికీ అభివాదం చేస్తూ కనిపించారు. అప్పుడు కొద్దిగా చిన్న పిల్లలం. ఆ తరువాత రాజులకే రారాజు లాంటి అన్న రామారావు ఎన్నిసార్లొచ్చారో, ఎన్ని రకాలుగా వచ్చారో..!

అంతేనా! మా కర్నూలుకు సుందరయ్య, సుర్జీత్, మాకినేని బసవపున్నయ్య, ఏచూరి, కరత్ ... ఇంకా ఎందరో వామపక్ష నాయకులు వచ్చారు. అన్ని పార్టీలవాళ్ళూ వచ్చారు. ఎంతో మంచి సందేశాలిచ్చి పోయారు. వెనుకబడిన మా ప్రాంతానికి ఎన్నో సేవలు కూడా చేశారు. అసలు ఒకప్పటి రాష్ట్ర రాజధాని మా కర్నూలు. ఆ వైభవం ఆ ఠీవి అన్నీ గతం ఇప్పుడు. ఐతేనేం మాకు ఎందరో రాజులు, రారాజులు వస్తూ పోతూ ఉన్నారు. ఇంకా చెప్పాలంటె వస్తుంటారు పోతుంటారు.

ఇప్పుడొస్తున్న సందర్భం వేరు. అదేమంటే తగ్గిన జి.ఎస్.టి పన్ను వల్ల ఎన్నో కోట్ల రూపాయలు ప్రజలకు మిగిలాయ ంట. అందుకే పొదుపు పండగ చేస్తున్నారు చాలా ఆర్భాటంగా. గిట్టనోళ్ళు ఎన్నెన్నో మాట్లాడొచ్చు. వంద కోట్లు ఖర్చు చేస్తున్నారు అనవసరంగా అనొచ్చు. వాహనాలను ఎక్కడివక్కడ ఆపేశారంటారు, ముందస్తుగా కొందరి ఇళ్ళ దగ్గర కాపలా పెట్టి వాళ్ళను బయటకు రాకుండా చేశారనీ అనొచ్చు. అవునండి ఎక్కువరిస్తే అరెస్టులు కూడా చేస్తారు. ఇది ప్రజాస్వామ్యం మరి. అంతటి మారాజొస్తూ ఉండే. ఆ మాత్రం ఖర్చు, రోడ్లు బాగుచేయడాలూ ఉండవా.

ఇరవై మంది అయ్యేయెస్సులు, ఐపీయస్సులు వచ్చారని, ఇక మంత్రులంతా ఇక్కడే ఉన్నారని, సీ.ఐలకు, ఎస్సైలకు లేక్కే లేదనీ ఇవన్నీ ఖర్చులంటె ఎలా. మారాజొస్తుంటే. ఆఫ్టరాల్ పెంచిన పన్ను తగ్గించి ఇంత ఖరీదైన మీటింగని అడగొచ్చా ఎంత ప్రజాస్వామ్యంలో ఉన్నా? మా అమ్మమ్మ చెప్పే డైలాగు గుర్తొస్తోంది అదేమంటే ఉప్పిండి (ఉప్మా) కంటే ఊర్మిండి (పచ్చడి) ఖర్చు ఎక్కువైందని. అవుతాయండీ అవుతాయి, ఎందుకవ్వవు. ఆ మాత్రం ఖర్చు పెడితే ఎందుకు మీకు కడుపు మంట! రాజుగారిని వేయి కళ్ళతో చూడండి, వేల నోళ్ళతో కీర్తించండి.

కరువు, నిరుద్యోగం మా ప్రాంతానికి ప్రత్యేకం. అందుకే మా కడుపులు మాడుతున్నాయంటున్నారు. ప్రత్యేక హోదా ఏమైందని అడుగుతున్నారు. అలా న్యాయమైనవి అడగండి, మారాజుతో విన్నవించుకోండి. వెంట ఉండే చిన్న రాజునడగండి, పక్కనుండే పవనరాజు నడగండి, ఒకవేళ చిన్నారి రాజొస్తే ఆయననూ అడగండి. అంతే కాని బ్యానర్లకు, రోడ్లపైన కట్టే తోరణాలు, పైనుండి చల్లే పూలను ఖర్చూ ఖర్చూ అనకండి. హైకోర్టు బెంచీనో, కుర్చీనో తప్పక ఇస్తారు. కాస్త ఓపిక పట్టండి. 2047 ఎంతో దూరంలో లేదు. అప్పటికి అన్నీ వస్తాయి. అప్పుడు ఎవరుంటారో, ఎవరు పోతారో అని మీ అనుమానమా. దానికి ఎవరండీ గ్యారెంటీ. చూడాలంటె ఉండాలి మరి. అంత వరకూ ఉప్పిండి చేసుకుంటూ ఉండండి మారాజులొచ్చి అందులో ఊర్మిండి, అది ఎంత ఖర్చైనా సరే వేస్తారని మాత్రం మరవకండి. రాజు రావడమే మనకొక పండుగ మరి.

- జంధ్యాల రఘుబాబు
సెల్ : 9849753298

రాష్ట్రాభివృద్ధికి తోడ్పడని ప్రధాని పర్యటనలేల?

సందర్భం

వి. రాంభూపాల్

రాష్ట్రాభివృద్ధి కోసమే మా మైత్రి అని గత సంవత్సరం మే 3,4 తేదీలలో పీలేరు, విజయవాడ, రాజమండ్రి, అనకాపల్లి ఎన్నికల సభల్లో దేశ ప్రధాని మోడీ, తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలు ఉమ్మడిగా ప్రకటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఒకటిన్నర సంవత్సరంలో నాలుగు సార్లు రాష్ట్రంలో పర్యటించారు, మరోసారి ఈ నెల 16న కర్నూలుకు వస్తున్నారు. ఈ సభలో జిఎస్టీ సుంకాల తగ్గింపు గురించి మాట్లాడేందుకు వస్తున్నారు. ఈ పర్యటనల వల్ల రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏమైనా మేలు జరిగిందా? రాష్ట్ర విభజన సందర్భంగా మన రాష్ట్రానికి చట్టబద్ధంగా ఇచ్చిన ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి పూనుకోని ప్రధాని పర్యటనలేల? విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మొండిగా అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని కూటమి నేతలు కీర్తించడం వల్ల ప్రయోజనమేమిటి? మాటల గారడీలు కట్టబెట్టి, రాష్ట్రాభివృద్ధికి ప్రధాని సహాయ చర్యలు ప్రకటించాలి. అందుకు ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలి. జిఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.తొమ్మిది వేల కోట్ల లోటు వచ్చిందన్న ముఖ్యమంత్రి, ఆ లోటు విషయమై మోడీని డిమాండ్ చేయాలి. జిఎస్టీ లోటును కేంద్రం నుండి సాధించకుండా ప్రజలపై అదనపు భారాలు మోపుతామంటే సహించరు. మోడీ గత పర్యటనల అనుభవాన్ని బట్టి పరస్పర పొగడ్తలకు పరిమితం కాకుండా...ప్రజా సమస్యలకు, రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని...మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలపై ప్రజలు వివిధ రూపాల్లో ఒత్తిడి తేవాలి. ట్రంప్ సుంకాల టెర్రరిజం వల్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. హెచ్1బి వీసా ఫీజు పెంపు, ఐ.టి ఉద్యోగుల తొలగింపులతో రాష్ట్రంలోని యువత తీవ్ర ఆందోళనలో వున్నారు. వీటి పరిష్కారానికి ప్రధాని నిర్దిష్ట చర్యలు ప్రకటించాలి

సామ్రాజ్యవాద సుంకాల బెదిరింపులు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచంలో ఏ దేశం మీదా లేనంత భారీ స్థాయిలో మన దేశం మీద 50 శాతం సుంకాలను వేశాడు. దేశ ఫార్మా (మందుల పరిశ్రమ), సినీ పరిశ్రమపై వంద శాతం పన్నులు మోపాడు. దుస్తులు, రొయ్యలు, చేపలు, తోలు సరుకులు, టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, యంత్రాలు, ఆటో విడి భాగాలు, జీడిపప్పు, తివాచీలపై దీని ప్రభావం మరింత ఎక్కువగా వుంటుంది. 53 కోట్ల మంది ఆధారపడిన మన వ్యవసాయ రంగంలోకి అమెరికా కంపెనీలు జొరబడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా అమెరికా నుండి దిగుమతి అయ్యే వ్యవసాయోత్పత్తుల మీద సుంకాలు తగ్గించాలని లేదా పూర్తిగా రద్దు చేయాలని మోడీపై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నాడు. చైనాపై టారిఫ్‌లు పెంచితే, అమెరికా దిగుమతులపై చైనా సుంకాలు విధించి అమెరికాను దారికి తెచ్చుకున్నది. ప్రపంచీకరణ పేరుతో 1995లో మనలాంటి దేశాలపై ఒత్తిడి తెచ్చి ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యు.టి.ఓ) ద్వారా చేయించుకున్న ఒప్పందాలను కూడా నేడు ట్రంప్ ధిక్కరిస్తున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల మీద 113 శాతం సుంకాలు వేసే హక్కు ఉన్నా మన దేశం వేస్తున్న పన్ను కేవలం 36.5 శాతం మాత్రమే. ఈ మాత్రం పన్ను కూడా రద్దు చేసుకోమంటూ ట్రంప్ బెదిరిస్తున్నాడు. అతి చిన్న దేశాలు సహితం ట్రంప్ బెదిరింపులను ధిక్కరిస్తూ ఆయా దేశాల సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటుంటే మన ప్రధాని మాత్రం 'వాణిజ్య సుంకాల' ఒప్పందం పేరుతో సాగిలపడడానికి సిద్ధపడుతున్నారు. 50 శాతం సుంకాల ప్రభావం మన రాష్ట్రంలోని రొయ్యల పరిశ్రమ వెంటనే ప్రభావం చూపింది. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న రొయ్యలకు ప్రధాన మార్కెట్ అమెరికా పెరిగిన సుంకాలను చెల్లించలేక రొయ్యల పరిశ్రమ దివాళా తీస్తుంది. దీని మీద ఆధారపడిన వేలాదిమంది వీధిన పడుతారు. ముఖ్యంగా ఆహార పంటలను కాదని రొయ్యల కోసం ఉప్పుకయ్యలుగా మార్చిన మన భూముల భవిష్యత్తు ఏమిటి? ఇప్పటికే పత్తికి గిట్టుబాటు ధర రాక రైతులు ప్రతి సంవత్సరం రోడ్డు ఎక్కుతున్నారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతానికి కేంద్రం తగ్గించింది. మొత్తం పన్ను రద్దు చేయాలని ట్రంప్ ఒత్తిడి తెస్తున్నాడు. అందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే పత్తి రైతుకు మరణశాసనమే. అలాగే కోళ్ళ పరిశ్రమ, పాడి పరిశ్రమ, బట్టల పరిశ్రమ తీవ్ర ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ట్రంప్ సుంకాల వల్ల వివిధ రంగాల్లో ఉపాధి పొందుతున్న లక్షలాది వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికులు ఉపాధి కోల్పోతారు.



హెచ్1బి వీసా

గత రెండు మూడు దశాబ్దాలుగా మన రాష్ట్రం నుండి అమెరికాకు వలసలు పెరిగాయి. మెడిసిన్, ఇంజనీరింగ్ పూర్తి చేసి అమెరికా వెళితే మెరుగైన ఉపాధి లభిస్తుందనే ఆశ రాష్ట్రంలో గణనీయంగా పెరిగింది. అమెరికా పౌరులకు ఇచ్చే వేతనాల కంటే మన వారికి తక్కువ వేతనాలు ఇచ్చి ఇంత కాలం లాభపడిన అమెరికా కంపెనీలకు, ట్రంప్ లాంటి నాయకులకు ఇప్పుడు అమెరికా పౌరులు గుర్తుకు వచ్చారు. మన వారిని వలసదారులని, తక్కువ జాతి వారని, నాగరికత లేని వారని అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లోని జాత్యహంకార శక్తులు ఘోరంగా అవమానిస్తున్నాయి. మన మహిళలు బొట్టు పెట్టుకోవడాన్ని కూడా సహించలేకపోతున్నారు. మన వారిలో కొందరిని అక్రమ వలసదారులంటూ బేడీలు వేసి బలవంతాన వెనక్కి పంపారు. ఇంతగా అవమానిస్తున్నా మన పౌరులపక్షాన నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది.

హెచ్1బి వీసా ద్వారా మన వారికి ఉద్యోగాలు ఇచ్చిన కంపెనీలు అమెరికాకు కోటి రూపాయలు చెల్లించాలని ట్రంప్ ప్రకటించాడు. ఈ వీసా కింద వున్న మొత్తం ఉద్యోగుల్లో మన దేశీయులు 71 శాతం, అందులో మన తెలుగు రాష్ట్రాల వారు 34 శాతం. లక్షల కుటుంబాల జీవితాలతో ట్రంప్ చెలగాటమాడుతుంటే 'మై ఫ్రెండ్' అంటూ గొప్పలు చెప్పుకుంటున్న మోడీ నిలదీయరు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మోడీని అడగరు. మన యువత భవితను కాపాడలేని, దేశ ప్రయోజనం కాపాడలేని ఈ స్నేహాలు ఎందుకు? అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మన రాష్ట్ర యువత ఉపాధి కోల్పోయి, వెనక్కి రాలేక అక్కడే వుండలేక అల్లాడుతున్నారు. ఇక్కడున్న తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కడప ఉక్కు-వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజి

వెనుకబడిన రాయలసీమలో కడప ఉక్కు పరిశ్రమను స్థాపించి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర పాలకులు హామీ ఇచ్చారు. మన రాష్ట్ర పాలకులు నాలుగు సార్లు శంకుస్థాపనలు చేసినా, ఇప్పటి వరకు అరడుగు పని జరగలేదు. గత ఆరున్నర సంవత్సరాల క్రితం 'రాయలసీమ డిక్లరేషన్' పేరుతో బిజెపి ప్రకటించిన హామీల్లో ఒక్కటి అమలు చేయకుండా ఈ ప్రాంత ప్రజలను దగా చేసింది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అంటూ ఊరించారే తప్ప పైసా ఇవ్వలేదు. అభివృద్ధి చేయకపోగా సోలార్ పేరుతో వేలాది ఎకరాల రైతుల భూముల్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు.

విశాఖ ఉక్కును కాపాడాలి

ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర బిజెపి పాలకులు శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రజల మద్దతుతో కార్మికులు ఐక్యంగా సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్యాకేజి ఇచ్చి 43 యూనిట్లను ప్రైవేటీకరిస్తూ, వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నారు. దీన్ని అడ్డుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట చెప్పి నేడు అసెంబ్లీలో కేంద్రానికి ధన్యవాదాలు చెబుతూ తీర్మానం చేసింది. ఇప్పటికైనా స్వంత గనులు కేటాయించి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే అభివృద్ధి చేయాలి.

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఐదు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని చెప్పిన కేంద్ర పాలకులు 12 సంవత్సరాలు గడిచినా సగం పని కూడా పూర్తి చేయలేదు. ముంపు బాధిత గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర పాలకులు పునరావాస పనులు పూర్తి చేయలేదు. రాజధాని నిర్మాణం కేంద్ర బాధ్యత అని గత 11 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన మోడీ అందుకు అవసరమైన నిధులను, చట్టబద్ధ గుర్తింపును ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మాటల గారడీలు కట్టబెట్టి, రాష్ట్రాభివృద్ధికి ప్రధాని సహాయ చర్యలు ప్రకటించాలి. అందుకు ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలి. జిఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.తొమ్మిది వేల కోట్ల లోటు వచ్చిందన్న ముఖ్యమంత్రి, ఆ లోటు విషయమై మోడీని డిమాండ్ చేయాలి. జిఎస్టీ లోటును కేంద్రం నుండి సాధించకుండా ప్రజలపై అదనపు భారాలు మోపుతామంటే సహించరు. మోడీ గత పర్యటనల అనుభవాన్ని బట్టి పరస్పర పొగడ్తలకు పరిమితం కాకుండా... ప్రజా సమస్యలకు, రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని... మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలపై ప్రజలు వివిధ రూపాల్లో ఒత్తిడి తేవాలి.

హైడ్రో పవర్, సోలార్ పవర్ పేరుతో మోడీకి ప్రియమిత్రుడైన గౌతం ఆదానీకి లక్షల ఎకరాల భూమిని కూటమి నేతలు కట్టబెడుతున్నారు. రైతులు వద్దంటున్నా, తిరస్కరిస్తున్నా బెదిరింపులు, పోలీసు కేసులు, నిర్బంధాల ద్వారా గతంలో వైసిపి వలె ప్రస్తుత కూటమి నేతలు ప్రజల గొంతు నొక్కుతున్నారు. అదానీ కంపెనీకి వేల కోట్ల లాభం కోసం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారు. సముద్ర తీరం మొత్తాన్ని వివిధ పేర్లతో కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు.

జిఎస్టీ నష్టాన్ని రాష్ట్రానికి చెల్లించాలి

ప్రజల కొనుగోలు శక్తి తగ్గి సరుకుల అమ్మకాలు తగ్గిపోవడం, ధరల కోరల్లో చిక్కుకుపోవడంతో అనివార్యంగా జిఎస్టీ శ్లాబులను కేంద్రం తగ్గించాల్సి వచ్చింది. ఒకే దేశం - ఒకే పన్ను పేరుతో 2017 నుండి రూ.55 లక్షల కోట్లు ప్రజల నుండి పిండుకున్న కేంద్రం గాయం చేసిన వాడే వెన్న పూసినట్లుగా రూ.48 వేల కోట్ల భారాన్ని తగ్గించి పండగ చేసుకోమంటున్నది. పెద్ద ఘనకార్యం చేస్తున్నట్టుగా అందుకు దేశమంతటా సభలు జరుపుతున్నది. రాష్ట్రాలకు తగ్గుతున్న ఆదాయంపై అన్ని రాష్ట్రాలు చివరకు ఉత్తరప్రదేశ్ బిజెపి ప్రభుత్వం కూడా కేంద్రానికి లేఖ రాస్తే మన ముఖ్యమంత్రి మాత్రం రాష్ట్రమంతటా వేలాది సభలు జరిపి నరేంద్ర మోడీ జపం చేస్తున్నారు.

తీవ్ర సమస్యల్లో వున్న దేశ యువతను, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, రైతాంగం దృష్టిని మళ్ళించేందుకు ఈ సంబరాలు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వానికి కీలక మద్దతుదారుగా వున్న టిడిపి, జనసేన పార్టీలు ఈ సమయంలో కూడా రాష్ట్రాభివృద్ధికి నిధులు సాధించలేకపోతే, జిఎస్టీ వల్ల తగ్గుతుందని చెబుతున్న ఆదాయాన్ని రాబట్టకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుంది? రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం ముగిసినా ఇంకా మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కోలుకోలేదు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఉచిత పథకాలను ప్రకటించిన కూటమి నేతలు, నేడు నిధులు లేవని మొసలి కన్నీరు కారుస్తున్నారు. కేంద్రం నుండి నిధులు రాబట్టడానికే కదా బిజెపి తో స్నేహం అన్నది. ఆ దిశగా సాధించింది ఎంతో ప్రజలకు కేంద్ర, రాష్ట్ర పాలకులు కర్నూలు సభలోనైనా వివరించాలి.

మోడీ పర్యటిస్తున్న కర్నూలు జిల్లాలో వ్యవసాయ కూలీల వలసలు పెరిగినట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. వలసల శాశ్వత పరిష్కారానికి ఈ ప్రాంతంలో వున్న ఖనిజ వనరులు, వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలు స్థాపించాలి. కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్మించాలి. వ్యవసాయ, ఉద్యాన పంటలను ట్రంప్ సుంకాల బారి నుండి కాపాడాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. అమెరికా సుంకాల దెబ్బకు, వీసా రుసుం పెంపుతో అల్లాడిపోతున్న యువత భవితకు గ్యారంటీ ఇవ్వాలి. ఈ సమస్యలకు పరిష్కారం చూపని ప్రధాని పర్యటనల వల్ల ఒరిగేదేమిటి? అందుకే పాలకుల విధానాలను ప్రజలు, ప్రజాతంత్రవాదులు ప్రశ్నించాలి. మోసకారి మోడీ పర్యటనను నిరసించాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

పాకిస్తాన్ గెలుపుపై నీళ్లు

- ఇంగ్లండ్‌కు తప్పిన ఓటమి
- ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్



కొలంబో: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ గెలుపు ఆశలపై వర్షం నీళ్లు కురిసాయి. ఇంగ్లండ్ మహిళలు నిర్దేశించిన 113 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ 6.4ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 34పరుగులు చేసి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించే దిశగా పయనిస్తోంది. ఆ దశలో మళ్లీ వర్షం కురవడం మ్యాచ్ రద్దయ్యింది. అంతకుముందు ఇంగ్లండ్ మహిళలు తొలిగా బ్యాటింగ్‌కు చేస్తూ 25ఓవర్లలో 79 పరుగులకే 7వికెట్లు కోల్పోయిన దశలో భారీ వర్షంతో మ్యాచ్ అర్థాంతరంగా నిలిచింది. ఆ తర్వాత సుమారు మూడు గంటల అనంతరం తిరిగి మ్యాచ్ ప్రారంభమైంది. దీంతో మ్యాచ్‌ను 31ఓవర్లకు కుదించారు. దీంతో నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ జట్టు 9వికెట్లు నష్టపోయి 133 పరుగులు చేసింది. దీంతో డిఆర్ఎస్ పద్ధతిపై పాకిస్తాన్ లక్ష్యాన్ని 113 పరుగులుగా నిర్ణయించారు. ఆ లక్ష్యాన్ని పాక్ జట్టు ఛేదించే క్రమంలో 34పరుగుల వద్ద ఉండగా మళ్లీ భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా(4/27)కి తోడు సాదియా ఇక్బాల్‌కు రెండు, దినా, షమీమ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఇక ఇంగ్లండ్ బ్యాటర్లలో ఛార్లీ డీన్(33), హీదర్ నైట్(18), అర్లాట్(18) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో 4మ్యాచ్‌లు ముగిసేసరికి ఇంగ్లండ్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది.

ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు భేష్..

- ఎంఎస్ఎంఇలకు మద్దతును పెంచాయి
- రుణాల జారీలో ప్రయివేటు బ్యాంక్‌ల కంటే మెరుగు
- ఆర్థిక సేవల కార్యదర్శి ప్రశంస



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ సేవలను అందించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు మెరుగ్గా పని చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు అన్నారు. రుణాల వృద్ధిలో ప్రయివేటు రంగ బ్యాంక్‌ల కంటే ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు బాగా ముందంజలో ఉన్నాయని ప్రశంసించారు. రుణాల పరిశీలన, రుణ ప్రమాణాలు, ప్రాజెక్ట్ రుణాల పర్యవేక్షణలో పిఎస్‌బిలు భారీ వృద్ధిని సాధించాయన్నారు. బుధవారం జలంధర్‌లోని పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ ఎంఎస్ఎంఇ స్పోర్ట్స్ క్లస్టర్ శాఖను నాగరాజు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వ బ్యాంకులు సామర్థ్యం, పారదర్శకత, విశ్వాసంపై దృష్టి సారించడం వల్ల వినియోగదారులు మళ్లీ వీటి వైపు ఆకర్షితులవుతున్నారు. భారత ఆర్థిక వృద్ధికి ముఖ్యమైన ఎంఎస్ఎంఇలు, స్టార్టప్‌లకు బ్యాంకులు మరింత మద్దతు అందించాలి." అని నాగరాజు కోరారు. ప్రతి కస్టమర్‌ను గౌరవంతో చూస్తూ, డిజిటల్ సేవలు సులభంగా, స్థిరంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చూడలని సూచించారు. 'జలంధర్ క్రీడా పరిశ్రమ ఎంఎస్ఎంఇ అభివృద్ధి, ఆవిష్కరణ ప్రపంచ పోటీతత్వానికి ఒక ఉదాహరణ. ఈ కొత్త శాఖలు అందరినీ కలుపుకొని, రంగాల వారీగా వృద్ధిని ప్రోత్సహిస్తాయి. ఇవి ఔత్సాహికవేత్తలను బలోపేతం చేస్తాయి. ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. దేశ ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచుతాయి." అని పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ ఎండి, సిఇఒ స్వరూప్ కుమార్ సాహా పేర్కొన్నారు.



ఎల్ఐసి నుంచి బీమా లక్ష్మీ ప్లాన్

- మరో పాలసీ జన సురక్ష ఆవిష్కరణ

ముంబయి : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ ఎల్ఐసి కొత్తగా రెండు పాలసీలను విడుదల చేసింది. బీమా లక్ష్మీ, జన సురక్ష పేరుతో వీటిని ఆవిష్కరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ రెండు పాలసీలను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. వీటికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎల్ఐసి సిఇఒ, ఎండి ఆర్ దొరైస్వామి మిగితా ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. అందరికీ బీమా కల్పించాలన్న ఉద్దేశంతో తక్కువ ధరలో జన సురక్ష ప్లాన్‌ను ప్రవేశపెట్టినట్లు ఎల్ఐసి వెల్లడించింది. తక్కువ ప్రీమియం చెల్లింపులు కలిగిన దీనికి మార్కెట్ ఒడుదొడుకులతో సంబంధం లేదు. 12-20 ఏళ్లకాలవ్యవధి కలిగిన ఈ ప్లాన్‌ను 18-55 ఏళ్ల వయసున్నవారు ఎవరైనా కొనుగోలు చేయవచ్చు. కనీస బీమా హామీ మొత్తం రూ.1లక్ష కాగా.. గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఎంచుకోవచ్చు. పాలసీ కాలవ్యవధిలో పాలసీదారుడికి ఏదైనా జరిగినా హామీ మొత్తాన్ని సంస్థ చెల్లిస్తుంది. ఈ పాలసీపై రుణ సదుపాయాన్ని కూడా కల్పించింది.

మహిళలకు బీమా సదుపాయం కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో బీమా లక్ష్మీ పాలసీని రూపొందించింది. ఇది కూడా మార్కెట్‌కు అనుసంధానమై ఉండదు. పాలసీ తీసుకోవడానికి 18 నుంచి 50 ఏళ్ల మహిళలు అర్హులు. కనీస బీమా హామీ మొత్తం రూ.2 లక్షలు. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు. ఏటా 7 శాతం చొప్పున ప్రీమియం చెల్లింపుపై గ్యారెంటీడ్ అడిషన్‌ను చెల్లిస్తుంది. మెచ్యూరిటీ సమయంలో బీమా హామీ మొత్తం సహా గ్యారెంటీడ్ అడిషన్‌ను అందిస్తుంది. పాలసీదారుడికి ఏదైనా జరిగితే వార్షిక ప్రీమియానికి 10 రెట్లు లేదా బీమా హామీ మొత్తంలో ఏది ఎక్కువైతే దాన్ని చెల్లిస్తుంది.

కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం, శ్రీకాకుళం జిల్లా గార పరిధిలో ఇంటిగ్రేటెడ్ బీచ్ శాండ్ మైనింగ్ ప్రాజెక్టును ప్రైవేటు సంస్థ అల్లూవియల్ మినరల్స్‌కు అప్పగింతను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారించింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధమన్న పిల్‌లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎపి ఖనిజాభివృద్ధి సంస్థలను ఆదేశించింది. మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో ప్రైవేటు సంస్థకు ఎంత శాతం చెల్లిస్తున్నారనే వివరించాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. పల్నాడు జిల్లా, పిడుగురాళ్లకు చెందిన పొన్నెకంటి మల్లిఖార్జునరావు వేసిన పిల్ తరపున న్యాయవాది వాదిస్తూ, బీచ్ శాండ్ మైనింగ్‌కు ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆధీనంలోనే మైనింగ్ జరగాలన్నారు. 2023 డిసెంబరు 14న జారీ చేసిన టెండర్‌లో మినరల్ షేర్ బిడ్డింగ్ సాధించిన కంపెనీకి 92 శాతం, ఖనిజాభివృద్ధి సంస్థకు 8 శాతంగా పేర్కొనడం దారుణమన్నారు.

యూనిబిక్ ఫుడ్స్ సిఇఒగా అజయ్ బతీజా

హైదరాబాద్ : ప్రముఖ కుకీస్, బిస్కెట్లు, స్నాక్ ఉత్పత్తుల సంస్థ యూనిబిక్ ఫుడ్స్ తన కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా అజయ్ బతీజాను నియమించినట్లు ప్రకటించింది. ఆయన సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు నాయకత్వం వహించడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపార విస్తరణకు దిశానిర్దేశం చేస్తారని యూనిబిక్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఆయనకు బ్రాండ్ బిల్డింగ్, కస్టమర్ మార్కెటింగ్, ఫ్రాంచైజ్ లీడర్‌షిప్‌లో ఉన్న విశాల అనుభవం కంపెనీకి ఎంతో మేలు చేస్తుందని ఆ సంస్థ బోర్డు ఛైర్మన్ సందీప్ రెడ్డి పేర్కొన్నారు.

ఎస్‌పి స్థాయి అధికారి విచారించాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ ఆర్‌టిసి కాలనీలో నివాసం ఉండే తన కొడుకు రెడ్డి గౌతం, కోడలు ఎల్లంటి లోచినిని అయిదేళ్ల క్రితం విశాఖ 4వ టౌన్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ ఉమ్మడి విశాఖ జిల్లా చోడవరానికి చెందిన రెడ్డి గోవిందరావు వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ఎస్‌పి స్థాయికి తగ్గని అధికారి విచారణ చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. విచారణ అధికారి అయిన అసిస్టెంట్ పోలీసు కమిషనర్ (విశాఖపట్నం, ద్వారకా సబ్ డివిజన్) ఆర్‌విఎస్ఎన్ మూర్తి 2021 డిసెంబర్ 2న ఇచ్చిన రిపోర్టును రద్దు చేసింది. విజయవాడ సిఐ (సైబర్ సెల్) శివాజీపై క్రమశిక్షణ చర్యలకు ఎన్‌టిఆర్ జిల్లా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఎస్‌పి ర్యాంకు అంతకంటే పైస్థాయి అధికారి తిరిగి విచారణ చేయాలంది. రెండు నెలల్లో విచారణ ప్రక్రియ పూర్తి చేయాలంది. అరెస్టు తేదీల విషయంలో పరస్పరంగా ఉండటంపై అనుమానాన్ని వ్యక్తం చేసింది. తప్పుచేసిన పోలీసులపై తాజాగా విచారణ అయ్యాక చర్యల ఉత్తర్వులు జారీ చేయాలని విశాఖపట్నం పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఆర్ రఘునందన్‌రావు, జస్టిస్ టిసిడి శేఖర్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం తీర్పు చెప్పింది.

48 గంటల కాల్పుల విరమణ

- పాక్, ఆఫ్ఘన్‌ల అంగీకారం
- సరిహద్దు ఘర్షణల్లో 40మందికి పైగా మృతి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు 48గంటల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని పాక్ విదేశాంగ శాఖ బుధవారం తెలిపింది. అంతకుముందు ఇరుదేశాల సరిహద్దు ప్రాంతాల్లో తాజాగా చెలరేగిన ఘర్షణలు, అల్లర్లలో డజన్ల సంఖ్యలో పౌరులు, సైనికులు మరణించారు. 40మందికి పైగా ఆఫ్ఘన్ తాలిబన్ కార్యకర్తలను హతమార్చామని పాకిస్తాన్ ఆర్మీ తెలిపింది. తాలిబన్ల అభ్యర్థన మేరకు పాక్ ప్రభుత్వం, ఆఫ్ఘన్ తాలిబన్ ప్రభుత్వం తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయాలని నిర్ణయించాయి. ఇది బుధవారం సాయంత్రం ఆరు గంటల నుండి 48గంటల పాటు అమల్లో వుంటుందని పాక్ విదేశాంగ శాఖ తెలిపింది. కాగా దీనిపై కాబూల్‌లోని తాలిబన్ అధికారుల నుండి వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. ఆఫ్ఘన్‌తో గల సరిహద్దు ప్రాంతాల్లో ఆఫ్ఘన్ తాలిబన్లు పలుసార్లు దాడులకు దిగారని, వాటిని తాము విజయవంతంగా తిప్పికొట్టామని పాక్ ఆర్మీ అంతకుముందు ప్రకటించింది. ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే తాలిబన్లు ఈ దాడులకు దిగారని పేర్కొంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో స్పిన్ బోల్డక్ ఏరియాలో నాలుగు చోట్ల ఆఫ్ఘన్ తాలిబన్లు దాడులకు పాల్పడ్డారు.

‘ఉక్కు’ ప్యాకేజీపై చిత్తశుద్ధి ఏదీ?

- మేమొచ్చాక ఎంతో చేశామని సిఎం, లోకేష్ ఊకదంపుడు
- ప్రైవేటీకరణ ఆగిపోయినట్టే అంటూ గొప్పలు
- మండిపడుతున్న కార్మిక వర్గం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగి తీరుతుందని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మాత్రం ఆ విషయమై ప్రజలను, కార్మికులను ఏమార్చుతోంది. తామొచ్చాకే ప్లాంట్‌కు ఎంతో చేశామని గొప్పలు చెబుతోంది. సొంత గనులు సాధించకుండా, ప్రధాని మోడీతో ప్రైవేటీకరణ లేదనిపించకుండా స్పష్టమైన ప్రకటన చేయించకుండా టిడిపి కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలపై ఉక్కు కార్మికవర్గం మండిపడుతోంది. 'ఇక ప్రైవేటీకరణ ఆగిపోయినట్లే'...స్ట్రాటజిక్ సేల్ (వ్యూహాత్మక అమ్మకం) నిర్ణయం ఉపసంహరించుకున్నట్లే' అంటూ పదేపదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ విశాఖ వచ్చిన ప్రతిసారి మాటలు వల్లెవేస్తూనే ఉన్నారు. విశాఖ స్టీల్‌కు కేంద్రం నుంచి రూ.11 వేల కోట్లు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం రూ.మూడు వేల కోట్లు అందించి మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను పనియిస్తుందని, లాభాల్లోకి వచ్చేలా తెచ్చామని ఈ నెల 12న విశాఖలోని ఎఐ (గ్రాండ్)లో సిఫీ కంపెనీ నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేష్ చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో ఒక్క ఫర్నేస్‌తోనే ప్లాంట్ నడిచిందని, తాము ఇప్పుడు మూడు ఫర్నేస్‌తో నడుపుతున్నామని చెప్పారు. అయితే స్టీల్‌ప్లాంట్ చరిత్రలో ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో ప్లాంట్ ఎప్పుడూ నడవలేదు. 1991లో బ్లాస్ట్ ఫర్నేస్ -1 ప్రారంభమైనప్పట్నుంచి 2021 వరకూ కేవలం సొంత రిపేర్లు చేయడానికి మాత్రమే వదిలేసారి బ్లాస్ట్ ఫర్నేస్‌లను నిలుపుతున్నారు. 2021 జనవరి 27న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ను స్ట్రాటజిక్ సేల్‌కు పెట్టిన తరువాత పదేపదే బ్లాస్ట్ ఫర్నేస్‌లను ఒకదాని తర్వాత ఒకటి ఆపేసి ఉత్పత్తిని దెబ్బతీసింది. ఇలా బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో వినియోగించుకుంటున్న ప్లాంట్‌కు కోట్ల రూపాయలు అదనపు భారం పడుతూ వస్తోంది. 2012 నుంచి 2022 వరకూ సుమారు 12 ఏళ్ల పాటు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూడు నిరాటంకంగా నడిచిన చరిత్ర ఉంది.

బ్లాస్ట్ ఫర్నేస్‌లను ఎలా దెబ్బతీస్తూ వచ్చారు ?

2022 ఫిబ్రవరి నుంచి 2023 డిసెంబరు వరకూ అంటే 22 నెల పాటు బ్లాస్ట్ ఫర్నేస్ - 3ని నిలుపుదల చేశారు. 2024 మే నుంచి అక్టోబర్ వరకూ ఏడు నెలల పాటు బ్లాస్ట్ ఫర్నేస్ -1ను నిలుపుదల చేశారు. 2024 అక్టోబర్ నుంచి 2025 జూన్ వరకూ తొమ్మిది నెలల పాటు మరోసారి బ్లాస్ట్ ఫర్నేస్ -3ని నిలిపివేశారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ఉత్పత్తి సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులు. 2024-25లో టిడిపి కూటమి వచ్చాక కేవలం 3.9 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది.

తాజాగా ఏం జరుగుతోంది?

ఈ ఏడాది జూన్‌లో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లో సరాసరి రోజుకు 14 వేల టన్నులు ఉత్పత్తి చేశారు. మూడో ఫర్నేస్ వచ్చాక అంటే మంత్రి లోకేష్ చెబుతున్నట్లు ఉత్పత్తి బాగా పెరగాలి. కానీ ఉత్పత్తి 16 వేల టన్నులకు మాత్రమే పరిమితమైంది. వాస్తవానికి మూడు ఫర్నేస్‌లు నడిస్తే గతంలో మాదిరిగా 21 వేల టన్నుల ఉత్పత్తి రావాల్సి ఉంది. కానీ అలా రావడం లేదు. దీన్నిబట్టి మంత్రి లోకేష్ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని కార్మికులు చెబుతున్నారు. పదేపదే పూర్తి సామర్థ్యంలోకి తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడుతున్నారు.

సురక్షా యాప్ వినియోగంపై మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నకిలీ మద్యం నివారణకు సురక్షా యాప్‌లో క్యూఆర్ స్కాన్ విధానాన్ని అన్ని దుకాణాల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తప్పనిసరిగా అమలు చేయాల్సిన నిబంధనలను ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మద్యం దుకాణాల్లో విక్రయించే ప్రతి సీసాపై కోడ్‌ను సురక్షా యాప్‌తో స్కాన్ చేయాలని, విక్రయించే మద్యం నాణ్యమైనదని ధ్రువీకరించినట్లు ప్రతి దుకాణం, బార్ వద్ద ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా మద్యం సీసాపై సీల్, క్యాప్, హోలో గ్రామ్, ప్రామాణికత తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి దుకాణం, బార్‌లో డైలీ లిక్కర్ రిజిస్టర్ నిర్వహించాలని, ఎక్సైజ్ సిబ్బంది రోజూ మద్యం దుకాణాల్లో ర్యాండమ్‌గా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. తనిఖీ వివరాలను దుకాణంలోని రిజిస్టర్‌లో నమోదు చేయాలని, డిపో నుంచి మద్యం అందాక కనీసం 5 శాతం సీసాలను స్కాన్ చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో నకిలీ మద్యం గుర్తిస్తే ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని సూచించారు. నకిలీ మద్యం దొరికితే లైసెన్స్ రద్దు చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నకిలీ మద్యంపై ఫిర్యాదులకు, పర్యవేక్షణ వ్యవస్థ తేవాలని, ఫిర్యాదులను 24 గంటల వ్యవధిలో విచారించి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూ కేటాయింపుపై పిల్‌లో మార్పులకు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

విశాఖలో సత్త్వ డెవలపర్స్‌కు భూమి కేటాయింపు చట్ట వ్యతిరేకమని బుధవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదిస్తూ.. ప్రభుత్వ విధానాన్ని సవాల్ చేస్తూ ప్రజాహిత వ్యాజ్యంలో తమ అభ్యర్ధనను సవరణ చేసేందుకు అనుమతినివ్వాలని కోరారు. ఇందుకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన బెంచ్ అనుమతినిచ్చింది. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. విశాఖపట్నంలోని మధురవాడ ఐటి హిల్ నెం.4 వద్ద 30 ఎకరాలను ఎంఎస్ సత్త్వ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎపి ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్స్ శాఖ కేటాయించింది. ఈ మేరకు వెలువడిన జిఓ 27ను సవాల్ చేస్తూ విశాఖకు చెందిన మేడపాటి వెంకటరెడ్డి పిల్ దాఖలు చేశారు. విచారణ సమయంలో హైకోర్టు, భూ కేటాయింపుల తర్వాత పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయా? అని ఆరా తీసింది. దీనిపై పొన్నవోలు స్పందిస్తూ, కంపెనీలకు భూ కేటాయింపును సవాలు చేయడం లేదని, విధాన ప్రకారం చేయలేదన్నదే తమ వాదనని చెప్పారు.

సచివాలయ ఉద్యోగులకు మద్యం షాపుల జియో కో-ఆర్డినేట్స్ బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం షాపుల భౌగోళిక అక్షాంశం, రేఖాంశ స్థానాలను జియో కో-ఆర్డినేట్స్ చేసే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ శాఖకు ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ నేపథ్యంలో డిజిఓ, డిడిఓ, ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు అందరూ రాష్ట్రంలోని అన్ని మద్యం షాపుల జియో కో-ఆర్డినేషన్ పనిని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టర్ శివప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాంగ్‌చుక్ అరెస్టుపై పిటిషన్ 29కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : లడఖ్ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణను ఈ నెల 29కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వాంగ్‌చుక్ అరెస్టును సవాలు చేస్తూ ఆయన భార్య గీతాంజలి జె.అంగ్మో ఈ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జోధ్‌పూర్ జైల్లో ఉన్న వాంగ్‌చుక్‌ను ఆయన సోదరుడు, న్యాయవాది కలిసినట్లు జైలర్ సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పిటిషన్‌ను సవరించడానికి, నిర్బంధ కారణాలను సవాలు చేయడానికి దరఖాస్తును దాఖలు చేస్తామని జె.అంగ్మో తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ ధర్మాసనానికి తెలిపారు. లడఖ్‌కు రాష్ట్రహోదాతో పాటు ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలతో వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశారు. లడఖ్‌లో హింసను ప్రేరేపించారంటూ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద సెప్టెంబర్ 26న అదుపులోకి తీసుకున్నారు. వాంగ్‌చుక్ ప్రస్తుతం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలులో ఉన్నారు.

మహారాష్ట్ర సిఎం ముందు మల్లోజుల లొంగుబాటు

గడ్చిరోలి: మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 60 మంది మావోయిస్టు సహచరులతో కలిసి అధికారికంగా లొంగిపోయారు. ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని ఫడ్నవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని పేర్కొంటూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి వైదొలిగారు. తాజాగా ఉద్యమాన్ని పూర్తిగా వదిలిపెట్టి అజ్ఞాతం వీడారు. మల్లోజులపై వందకు పైగా కేసులు ఉన్నాయి. మల్లోజులపై రూ.6 కోట్ల రివార్డు ఉన్నట్టు గడ్చిరోలి పోలీసులు ప్రకటించారు. కాగా ఛత్తీస్‌గఢ్‌లోనూ 50 మంది మావోయిస్టులు బీఎస్ఎఫ్ జవాన్ల ముందు సరెండర్ అయ్యారు. వీరిపై రూ.50 లక్షల రివార్డు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

లొంగిపోనున్న ఆశన్న !

మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే మావోయిస్టు పార్టీకి ఇబ్బందికర వార్త. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న.. దాదాపు 70 మంది సహచరులతో కలిసి గురువారం ఉదయం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ఎదుట లొంగిపోనున్నట్టు సమాచారం.

ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించిన రష్యా

- గ్యాసోలిన్ నిల్వలు సమృద్ధిగా వున్నాయని వెల్లడి

మాస్కో : రష్యాలో గ్యాసోలిన్ నిల్వలు తగ్గిపోతున్నాయంటే దానర్థం ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు కుప్పకూలిపోయే స్థితికి చేరుకుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను రష్యా బుధవారం కొట్టిపారేసింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వైఖరి పట్ల ట్రంప్ మంగళవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు పుతిన్ సుముఖంగా లేరని ట్రంప్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన పై వ్యాఖ్యలు చేశారు. దానిపై రష్యా డిప్యూటీ ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ మాట్లాడుతూ, ట్రంప్ హెచ్చరికలను తోసిపుచ్చారు. రష్యాలో గ్యాసోలిన్ సంబంధించి సుస్థిరమైన దేశీయ మార్కెట్ సరఫరా వుందని చెప్పారు. ఇందుకు సంబంధించి తమకు ఎలాంటి సమస్యలేదని స్పష్టం చేశారు. ఉత్పత్తి, వినిమయం మధ్య సమతుల్యత వుండేలా చూసుకుంటున్నాం. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా వుందన్నారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జెడి(యు) తొలి జాబితా విడుదల

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జెడి(యు) తన తొలి జాబితాను బుధవారం విడుదల చేసింది. 57 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్‌డిఎ సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం జెడి(యు)కు 101 సీట్లు లభించాయి.

దీనిలో ప్రస్తుతం 57 మంది అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. రాజోగిర్ నుంచి కౌశల్ కిషోర్, కళ్యాణ్‌పుర్ నుంచి క్యాబినెట్ మంత్రి మహేశ్వర్ హజారీ, సోన్‌బార్సా నుంచి రత్నేష్ సదా, మోకామా నుంచి అనంత్ సింగ్, మీనాపూర్ నుంచి అజయ్ కుష్వాహాలు బరిలోకి దిగుతున్నారు. 243 స్థానాలు ఉన్న అసెంబ్లీలో లోక్‌జన్‌శక్తి (రాంవిలాస్) 29 చోట్ల, హిందుస్థాన్ అవాం మోర్చా (హెచ్ఏఎం) ఆరుచోట్ల, రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం) ఆరుచోట్ల బరిలో దిగేలా సీట్ల సర్దుబాటు కుదిరింది. కాగా మరోవైపు టికెట్ పంపిణీపై అనేకమంది జెడియు నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ టికెట్ కోసం నితీశ్ ఇంటివద్ద నిరనసలు, రెబల్‌గా పోటీ చేస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీట్లు ఖరారైనా రెబల్స్ ఎక్కడ కొంపముంచుతారోనన్న భయం అభ్యర్థులను వెంటాడుతోంది. దీనికి తోడు అధికారపార్టీ తరపున బరిలోకి దిగనున్న మంత్రులను.. ఏం చేశారంటూ స్థానిక ఓటర్లు నిలదీస్తున్నారు.

కనీస పెన్షన్ పెంపు ఎప్పుడు.?

- ఇపిఎఫ్ఓ పింఛనుదారుల ప్రశ్న
- తాజా సిబిటి సమావేశంపై అసంతృప్తి
- కొత్త నిబంధనలపైనా విమర్శలు



న్యూఢిల్లీ : కనీస పెన్షన్ పెంపు ఎప్పుడు జరుగుతుందని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) పింఛనుదారులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జరిగిన ఇపిఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ (సిబిటి) సమావేశంలోనూ దీనిపై నిర్ణయం తీసుకోకపోవడంపై పెన్షన్‌దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రధాన డిమాండ్లను మరోసారి పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇపిఎస్-95 పథకానికి చెందిన వేలమంది పెన్షన్‌దారులు ఎప్పటినుంచో కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రూ. 1000గా ఉన్న నెలకు కనీస పెన్షన్‌ను రూ.7,500 పెంచాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో ఈ అంశం చర్చకు వస్తుందని అంతా భావించారు. కానీ, దీనిపై ఎలాంటి నిర్ణయమూ వెలువడకపోవడంపై అంతా నిరాశ వ్యక్తంచేస్తున్నారు.

ఇటీవల జరిగిన సిబిటి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎఫ్ పాక్షిక విత్‌డ్రాకు సంబంధించిన 13 సంక్లిష్టమైన నిబంధనలను సీబీటీ ఒకే నిబంధనగా క్రమబద్ధీకరించింది. మూడు రకాలుగా.. 'ముఖ్యమైన అవసరాలు' (అనారోగ్యం, విద్య, వివాహం), 'గృహ అవసరాలు', 'ప్రత్యేక పరిస్థితులు'గా వర్గీకరించింది. ఇకపై చందాదారులు తమ పీఎఫ్‌లోని ఉద్యోగి, యజమాని వాటా సహా పీఎఫ్ నిధిలో అర్హమైన బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు. అలాగే విత్‌డ్రా లిమిట్స్ కూడా పెంచింది. చదువు కోసం 10 సార్లు, వివాహం విషయంలో 5 సార్లు వరకు పాక్షిక విత్‌డ్రా చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ రెండింటికీ మూడుసార్లే తీసుకొనేందుకు అనుమతి ఉంది. అన్ని పాక్షిక ఉపసంహరణలకు చందాదారుల కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించింది. అయితే వీటిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ముందస్తు ఉపసంహరణలకు సంబంధించిన గడువును 2 నెలల నుంచి 12 నెలలకు పెంచడం, ఇపిఎస్ మొత్తం ఉపసంహరణకు వేచి ఉండే కాలాన్ని సైతం 2 నెలల నుంచి 36 నెలలకు సవరించడం, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో 25 శాతం కనీస నిల్వలు ఉండాలన్న నిబంధన తీసుకురావడంపై చందాదారులు, ప్రతిపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఈ నిబంధనలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 'ఇపిఎఫ్ఓ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు చాలా క్రూరమైనవి. ముఖ్యంగా పెన్షనర్లు, ఉద్యోగం కోల్పోయిన వారికి తమ సేవింగ్స్ అందకుండా చేస్తున్నారు. ఉద్యోగం పోయిన వారు ప్రావిడెంట్ ఫండ్ కోసం ఏడాది పాటు (ఇంతకుముందు 2 నెలలు) వేచి చూడాలి. పెన్షన్ నిధి అందుకోవాలన్నా మూడేళ్లు ఆగాలి. గతంలో ఇది 2 నెలలు మాత్రమే. 25 శాతం పీఎఫ్ సొమ్ము లాక్ అవ్వడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు. ఇది సంస్కరణ కాదు.. దోపిడీ! ప్రధాని మోడీ వెంటనే జోక్యం చేసుకుని సామాన్యుల జీవితాలతో చెలగాటం ఆడకుండా చూడాలి' అని కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ డిమాండ్ చేశారు.

అలాగే, "ఒక ఉద్యోగి ఏదైనా కారణంతో ఉద్యోగం కోల్పోతే.. ఆ వ్యక్తి బిల్లులు, ఈఎంఐలు ఎలా చెల్లిస్తాడు? ఒకవేళ ఏడాది తర్వాత నిధిని తీసుకున్నా కేవలం 75 శాతం మాత్రమే ఉపసంహరించుకోగలడు. మిగిలిన 25 శాతం మొత్తం కోసం రిటైర్మెంట్ దాకా వేచి చూడాలి. తమ నిధులను ఉపసంహరించుకోలేకుండా చేస్తే మధ్యతరగతి వ్యక్తి మనుగడ ఎలా?" అని కూడా ప్రశ్నించారు. ఈ కొత్త నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మహ్మద్ డిమాండ్ చేశారు. నిబంధనల సరళతరం పేరుతో కష్టపడి సంపాదించిన సొమ్మును దోచుకుంటున్నారని విమర్శించారు. 25 శాతం కనీస నిల్వ నిబంధన రిటైర్మెంట్ వరకు ఉపసంహరించుకునే అవకాశం ఇవ్వకపోవడం సరికాదని తప్పుబట్టారు.

కాగా, సిబిటి సమావేశంలో కనీస పెన్షన్ పెంపు అంశాన్ని చర్చించకపోయినప్పటికీ.. ఈ అంశం కేబినెట్ పరిశీలనలో ఉందని కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా వెల్లడించారు. సిబిటి అజెండాలో ఈ అంశం లేకపోయినప్పటికీ.. కార్మిక సంఘాల నేతలు ఈ అంశం లేవనెత్తడంతో ఆయన ఈవిధంగా స్పందించారు. కేబినెట్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

కేరళలో తొలి మహిళా పారిశ్రామిక పార్కు

తిరువనంతపురం: మహిళా పారిశ్రామికవేత్తల వృద్ధి కోసం కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో తొలి పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు నాయకత్వం వహించే సంస్థలకు మద్దతు ఇవ్వడం, వారు తదుపరి స్థాయికి ఎదగడానికి సహాయపడటం లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేరళ పరిశ్రమల మంత్రి పి. రాజీవ్ తెలిపారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఇప్పుడు మహిళా పారిశ్రామికవేత్తలు ఎక్కువ సంఖ్యలో ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ 'వ్యవస్థాపక సంవత్సరం' చొరవలో భాగంగా, రాష్ట్రంలో కొత్తగా నమోదు చేసుకున్న పారిశ్రామికవేత్తల లో 31 శాతం మంది మహిళలే. వ్యాపారంలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించడానికి, ప్రభుత్వం ప్రస్తుత నిబంధనలకు కీలక సవరణలు చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం, పంచాయతీ ప్రాంతాల్లోని 50 శాతం నివాస గృహాలలో మహిళలు ప్రస్తుతం సంస్థలు ప్రారంభించ డానికి అనుమతించబడతారు. ఎటువంటి పరిమితులు లేకుండా ఖాళీగా ఉన్న నివాస భవనాలలో కూడా వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ రంగంలోకి ప్రవేశించే మహిళలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణను ప్రభుత్వం నిర్ధారిస్తుంది. అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలు, ప్రదర్శనలలో పాల్గొనడానికి మహిళా వ్యవస్థాపకులకు పరిశ్రమల శాఖ ఆర్థిక సహాయం అందిస్తుంది. మహిళలు ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోవడానికి, ఆన్‌లైన్ మార్కెట్లలో తమ ఉనికిని బలోపేతం చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు.

కరూర్ తొక్కిసలాట ఘటనకు విజయ్ ఆలస్యంగా రావడమే కారణం

చెన్నై : కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనకు టివికె అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ ఆలస్యంగా రావడమే ప్రధాన కారణమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై తమిళనాడు అసెంబ్లీలో చర్చజరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ మాట్లాడుతూ.. కరూర్ తొక్కిసలాట ఘటన తమిళనాడు మొత్తాన్ని కలచివేసిందన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి వ్యక్తం చేశారు. టివికె షెడ్యూల్ తప్పిదాలే ఘటనకు కారణమన్నారు.

ర్యాలీకి విజయ్ మధ్యాహ్నం వస్తారని పార్టీ పేర్కొనగా.. ఆయన ఏడు గంటల తర్వాత వచ్చారని వెల్లడించారు. అప్పటికే పెద్ద ఎత్తున జనం గుమిగూడారన్నారు. ప్రచార వాహనం జనంలోకి వెళ్తుండగా.. గందరగోళం నెలకొనడంతో పాటు ఊపిరాడని కారణంగా తొక్కిసలాట చోటుచేసుకుందన్నారు. విజయ్ ఆలస్యమే తొక్కిసలాటకు ముఖ్యకారణమన్నారు. ఈ క్రమంలో కొందరు జనరేటర్ ఉన్న గదిలోకి ప్రవేశించి దాన్ని నిలిపివేశారన్నారు. తాగునీటితో సహా సరైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో టివికె విఫలమైందని విమర్శించారు. క్షతగాత్రులకు సాయం చేసేందుకు అత్యవసర సేవల సిబ్బంది ప్రయత్నిస్తుండగా.. టివికె కార్యకర్తలు రెండు అంబులెన్స్‌లపై దాడి చేశారన్నారు. ఈ దాడులకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించిన దర్యాప్తును సిబిఐకి అప్పగిస్తూ సుప్రీం కోర్టు ఆదేశించిన విషయాన్ని కూడా స్టాలిన్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

ఆగని ఇజ్రాయిల్ దాడులు

- రెడ్ క్రాస్ కమిటీ వద్దకు మరో 45 పాలస్తీనియన్ల మృతదేహాలు
- కళ్ళకు గంతలు, చేతులు, కాళ్లు కట్టేసిన వైనం
- అరకొరగానే ఆహారం, తాగునీరు



గాజా : కాల్పుల విరమణ అమల్లో వున్నా ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు కొనసాగిస్తూనే ఉంది. చెదురు మదురుగా ఇజ్రాయిల్ ఆర్మీ కాల్పులకు పాల్పడుతూ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తునే వుంది. ఖాన్ యూనిస్ నగరానికి తూర్పుగా షేక్ నాజర్ ప్రాంతంలో, బని సుహేలా పట్టణంలో పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ట్యాంకులు కాల్పులకు పాల్పడ్డాయని మీడియా వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని తమున్ పట్టణంలోకి ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకు వెళ్ళాయి. ఆ ప్రాంతమంతా సోదాలు జరుపుతూ మిలటరీ బుల్డోజరుతో సైడ్‌రోడ్లను శిథిలంచేసి ఆ దారిని మూసివేశారని స్థానికులు తెలిపారు. కాగా, మంగళవారం నాటి కాల్పుల్లో మృతుల సంఖ్య 9కి పెరిగిందని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

మరోపక్క ఇజ్రాయిల్ జైళ్ళలో మగ్గుతూ మరణించిన ఖైదీల మృత దేహాలను ఇజ్రాయిల్ అప్పగిస్తోంది. తాజాగా 45మృతదేహాలను రెడ్‌క్రాస్ కమిటీకి అందచేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తంగా 90 మృతదేహాలు అందాయని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ మృతదేహాల్లో కొన్నింటికి కళ్ళకు గంతలు కట్టి వున్నాయని, మరికొన్ని చేతులు, కాళ్ళు కట్టివేసి వున్నాయని వైద్య వర్గాలు తెలిపాయి. బహుశా జైళ్లలో ఉరిశిక్షలు అమలు చేసి వుండవచ్చని డాక్టర్లు మీడియాకు తెలిపారు. వందలు వేల సంఖ్యలో నిర్వాసితులు తిరిగి వస్తున్నా ఇక్కడ వారికి తల దాచుకునేందుకు ఒక్క ఇల్లు కూడా కనిపించడం లేదు. కేవలం రాళ్ళ గుట్టలు మాత్రమే అక్కడ మిగిలాయి.

గాజాలోని అన్ని క్రాసింగ్స్‌ను తెరిచి, తక్షణమే మానవతా సాయం పెద్ద మొత్తంలో అందేలా చూడాలని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయ డైరెక్టర్ జనరల్ ఇజ్రాయిల్‌ను కోరారు. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచాలన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడకు వస్తున్నారని,కానీ వారు తినడానికి గానీ తాగడానికి గానీ ఇక్కడ ఏమీ వుండడం లేదని, అందువల్ల ఆహారం, తాగునీరు అందే విషయంలో తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఒప్పందం కుదిరి దాదాపు వారం కావస్తున్నా ఇజ్రాయిల్ ఇప్పటికీ పరిమిత సంఖ్యలో ఆహార ట్రక్కులను అనుమతిస్తోంది. కేవలం 300ట్రక్కులను మాత్రమే అనుమతిస్తామని ఐక్యరాజ్య సమితికి తెలిపింది. అయితే కనీసం 600ట్రక్కులు పంపాలని ట్రంప్ ప్రణాళిక ప్రకారం అంగీకారం కుదిరింది. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, ఇంకా 20 మృత దేహాలు గాజాలోనే వున్నాయని ఇజ్రాయిల్ అధికారులు తెలిపారు.

మోడీ మోసకారితనాన్ని శ్రీశైల మల్లన్న కూడా క్షమించడు


(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షతన జరిగిన నిరసనలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేట్ల మేలు కోసమే జిఎస్‌టి సంస్కరణలను ప్రధాని మోడీ తీసుకొచ్చారన్నారు. దీనివల్ల రాష్ట్రానికి రూ.9 వేల కోట్ల నష్టం వస్తుందని, ఆ భారాన్ని ప్రజలపై వేయడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జిఎస్‌టి పండగ కాదని, దండగని అన్నారు. జిఎస్‌టి పేరుతో ప్రజలపై భారాలు వేయొద్దని, ప్రజలను మోసం చేయొద్దని కోరారు. ఏం వెలగబెట్టారని జిఎస్‌టి పండగ చేసుకుంటున్నారని ప్రశ్నించారు. వెనకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని మోసం చేశారన్నారు. గోదావరి నుంచి బనకచర్లకు నీళ్లు తెస్తామని చెబుతున్నారని, రూ.రెండు వేల కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా పెద్ద కంపెనీలకు మేలు చేయడం కోసం, నీళ్లను కూడా ప్రయివేటుపరం చేసి వ్యాపారం చేసేందుకు బనకచర్ల అంటున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే బనకచర్ల గురించి వాస్తవాలు చెప్పి ప్రజల ఆమోదం పొందాలన్నారు. మోడీ పర్యటనకు రూ.350 కోట్లు ఖర్చు పెడుతున్నారని, ఈ ఏడాదిలో నాలుగుసార్లు మోడీ పర్యటించారని, దాదాపు రూ.1,500 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. మెహర్బానీ కోసమే ప్రజల సొమ్మును చంద్రబాబు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. 11 ఏళ్లుగా మోడీ చెప్పిన మాటలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, బిజెపి... మోడీ సేవ చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇప్పటికైనా తిరుగుబాటు చేసి మోడీని ఇంటికి పంపించాలని కోరారు. మోడీ పర్యటనతో ప్రజల్లో సంతృప్తి రాదని, రాష్ట్రానికి, జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దితేనే వారు హర్షిస్తారని తెలిపారు. ఉల్లి, పత్తి, టమోటా రైతులు నష్టపోతున్నారని, జిల్లాలో ఉపాధిలేక వలసలుపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నార ని, ఇక్కడ మాత్రం ఇతర రాష్ట్రాల వారితో పని చేయించుకుంటున్నారని వివరించారు. ఆదోని టెక్స్‌టైల్ పార్క్, పత్తికొండ జ్యూస్ ఫ్యాక్టరీ ఏమయ్యాయని, పరిశ్రమల్లో ఇక్కడున్న వారికి ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కర్నూలుకు చెందిన మంత్రి టిజి.భరత్ అసెంబ్లీలో ఈ జిల్లా ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా... పరిశ్రమలకు భూమిలిచ్చామని, ఒక్క ఉద్యోగం కూడా రాలేదని చెప్పారని గుర్తు చేశారు. రైతుల నుంచి వేల ఎకరాలు గుంజుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని శ్రీనివాసరావు వివరించారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో 8,400 ఎకరాలు తీసుకొని ఆ భూములపై రూ.4,200 కోట్లు రుణం తీసుకుని ఎగ్గొడితే... రూ.500 కోట్లు కడితే మాఫీ చేస్తామంటున్నారని, ఎవడబ్బ సొమ్మని మాఫీ చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు రూ.లక్ష కోట్లు రుణం ఎగ్గొడుతున్నారన్నారు. మోడీ కర్నూలు సభలో టిడిపి ఒత్తిడి తెచ్చి ప్రజలకు మేలు చేసే ప్రాజెక్టుల గురించి అడగాలని సూచించారు. మోడీ పర్యటన రాష్ట్రానికి ఉపయోగపడేది కాదని, ఆ సభకు ప్రజలు మద్దతు ఇవ్వొద్దని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే పన్ను అని జిఎస్‌టి తీసుకొచ్చారని, అందులోనే సెంట్రల్, స్టేట్ జిఎస్‌టి అని విభజించారని తెలిపారు. జిఎస్‌టి వల్ల చిన్న వ్యాపారులపై భారం పడిందన్నారు. ఇప్పుడు తగ్గించామని చెబుతున్నా నిత్యావసరాల ధరలు తగ్గలేదని తెలిపారు. అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని చెప్పిన మోడీ ధరలు తగ్గించకపోగా పెంచుతున్నారని వివరించారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుకు కట్టబెడుతున్నారన్నా రు. గతంలో మోడీ రాష్ట్రానికి వచ్చి మట్టి, నీళ్లు తప్ప ఇచ్చిందేమీ లేదని గుర్తు చేశారు. చంద్రబాబు, జగన్, పవన్ కలిసి రాష్ట్రాన్ని మోడీ పాదాల దగ్గర పెడుతున్నారని విమర్శించారు. కర్నూలు ప్రజలు చైతన్యవంతు లని, మోడీ పర్యటనను వ్యతిరేకించి భవిష్యత్తులో వామపక్ష ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న మోడీ రాష్ట్రంలో పర్యటించేందుకు అర్హుడు కాదన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయని మోడీ పర్యటన దేనికోసమని ప్రశ్నించారు. నిరసన ప్రదర్శనలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, కెవి నారాయణ, జి.రామకృష్ణ, ఎండి ఆనంద్‌బాబు, టి.రాముడు, నగర కార్యదర్శి రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు లెనిన్ బాబు, మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష నాయకుల అరెస్టు మోడీ రాకను నిరసిస్తూ ర్యాలీ -అడ్డుకున్న పోలీసులు నంద్యాల/కలెక్టరేట్ :మోడీ రాకను నిరసిస్తూ వామపక్షపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. నగరంలోని పద్మావతినగర్ ఆర్చ్ నుంచి మొదలైన ర్యాలీ శ్రీనివాస్ సెంటర్‌కు చేరుకోగానే పోలీసులు అడ్డగించారు. గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనను అడ్డగించి బలవంతంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.నాగరాజు, టి. రామచంద్రుడు, పట్టణ కార్యదర్శి డి. లక్ష్మణ్, పుల్లా నరసింహులను, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, బాబాఫక్రుద్దీన్ తదితర నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టులను సిపిఎం, సిపిఐ వామపక్షాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

సిద్ధాంతాలు, క్రమశిక్షణకు కట్టుబడిన దీపక్ సర్కార్

- ప్రముఖ కమ్యూనిస్టు, కార్మిక నేత మృతికి సిఐటియు సంతాపం



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు, కార్మిక నేత కామ్రేడ్ దీపక్ సర్కార్ తన జీవితంలో చివరి వరకూ పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత క్రమశిక్షణకు ధృఢంగా కట్టుబడి ఉన్నారని సిఐటియు పేర్కొంది. కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘ సిద్ధాంతాల పట్ల దీపక్ సర్కార్‌కు ఉన్న అచంచలమైన నిబద్ధతకు ఆయన రాజకీయ జీవితమే తార్కాణమని తెలిపింది. సంస్థాగత క్రమశిక్షణకు ఆయన ధృఢంగా కట్టుబడి వున్నారని, తద్వారా ఆయనను అందరూ అభిమానించేవారని తెలిపింది. ఆయన మృతితో సిఐటియుకు, ప్రజాస్వామ్య ఉద్యమానికి తీరని నష్టమని పేర్కొంది. బెంగాల్‌లో కల్లోల పరిస్థితులు నెలకొన్న సమయంలో సర్కార్ నాయకత్వం, ఆయన ప్రదర్శించిన పట్టువిడుపుల ధోరణి జంగల్ మహల్ ప్రాంతంలో తృణమూల్ చేపట్టిన హింస, బీభత్సాన్ని ప్రతిఘటించడానికి కీలకంగా ఉపయోగపడిందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నపూర్‌లో తన నివాసంలో ఈ నెల 13న దీపక్ సర్కార్ (85) కన్నుమూశారు. ఆయన మృతికి సిఐటియు తీవ్ర సంతాపం తెలియచేసింది. ఆయనకు అరుణాంజలి ఘటిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపింది. ఈ మేరకు సిఐటియు ఒక ప్రకటన విడుదల చేసింది.

1940లో జన్మించిన దీపక్ సర్కార్ ప్రముఖ కమ్యూనిస్టు యోధులు సుకుమార్ సేన్‌గుప్తా నుండి స్ఫూర్తి పొంది 1960ల్లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్‌గా జీవితాన్ని ప్రారంభించినప్పటికీ ప్రజలకు సేవలందించడం పట్ల ఆయనకు గల నిబద్ధత ఆయనను 1985లో పూర్తి స్థాయి పార్టీ కార్యకర్తగా మార్చింది. 1970లో సిఐటియులో చేరిన కామ్రేడ్ సర్కార్ మిడ్నపూర్ జిల్లాలోని రోడ్డు, రవాణా కార్మికులందరినీ సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్య నేతగా ఎదిగిన ఆయన అవిభాజ్య మిడ్నపూర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత పశ్చిమ మిడ్నపూర్ జిల్లా అధ్యక్షుడిగా దశాబ్దాల పాటు పనిచేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ మాజీ సభ్యుడు కూడా అయిన సర్కార్ సిఐటియు అఖిల భారత వర్కింగ్ కమిటీ సభ్యులు. రోడ్డు రవాణా కార్మికుల సంఘం నిర్మాణానికి విశేషమైన సేవలందించిన సర్కార్ ఎన్నటికీ కార్మికుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని సిఐటియు తన ప్రకటనలో తెలిపింది. సిపిఎం అగ్ర నేతల్లో ఒకరైన కామ్రేడ్ సర్కార్ అవిభాజ్య మిడ్నపూర్ జిల్లా కార్యదర్శిగా 1992 నుండి పనిచేశారు. తర్వాత 2015 వరకు పశ్చిమ మిడ్నపూర్ జిల్లా కార్యదర్శిగా వున్నారు.

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పై నిర్ణయం తీసుకోండి

- ట్రయల్ కోర్టుకు సుప్రీం సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లిక్కర్ కేసులో మిగిలిన నిందితులతో సంబంధం లేకుండా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పై నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. వైసిపి నేత మిథున్ రెడ్డి బెయిల్ పై తుది నిర్ణయం తీసుకునేంతవరకూ ట్రయల్ కోర్టు మిగతా వారి బెయిల్ పిటీషన్లపై నిర్ణయం తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును వైసిపి నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్ ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ విశ్వనాధన్ లతో కూడిన ధర్మాసనం విచారించింది. లిక్కర్ కేసులో ఛార్జిషీటు దాఖలు చేసినా కొంతమంది నిందితులపై చార్జిషీటు దాఖలు చేయలేదంటూ ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరీ చేసిందని ధర్మాసనం దృష్టికి ప్రభుత్వం తరపు న్యాయవాది తీసుకెళ్లారు. మిథున్ రెడ్డిపై ఛార్జిషీటు దాఖలు చేయకపోయినా ఛార్జిషీటు దాఖలు చేసినట్లుగా భావించి ఆయనకు రెగ్యులర్ బెయిల్ ను మంజూరు చేసిందని అన్నారు. అందుకే తాము మిథున్ రెడ్డి బెయిల్ రద్దుపై హైకోర్టును ఆశ్రయించామని, మిథున్ రెడ్డి బెయిల్ పై తాము నిర్ణయం తీసుకునేంతవరకూ మిగతా వారి బెయిల్ పిటీషన్లపై నిర్ణయం తీసుకోకూడదని మాత్రమే హైకోర్టు ట్రయల్ కోర్టుకు సూచిందని తెలిపారు.

బనకచర్లకు డిపిఆర్ పిలిచారా?

- వారంలో వివరణ ఇవ్వండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కృష్ణా బోర్డు లేఖ

ప్రజాశక్తి-హైదరాబాద్, అమరావతి బ్యూరో

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు డిపిఆర్ తయారీ కోసం టెండర్లు పిలిచినట్లు అందిన ఫిర్యాదుపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కృష్ణాబోర్డు కోరింది. ఈ మేరకు బోర్డు నుండిరాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం లేఖ అందింది. ఎనిమిది పేజీల ఈ లేఖలో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 10వ తేదిన చేసిన నాలుగుపేజీల ఫిర్యాదును, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పిలిచినట్లు పేర్కొన్న టెండర్ నోటీసును జతపరిచారు. టెండర్ నోటీసుకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని వారం రోజుల్లో బోర్డు కార్యాలయానికి అందచేయాలని పేర్కొన్నారు. నాలుగుపేజీల లేఖలో టెండర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బోర్డును కోరింది. బనకచర్ల ప్రాజెక్టుకు ఎటువంటి అనుమతులు లేవని చెబుతూ కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించిన పలు వివాదాలను ప్రస్తావించింది. అయితే, ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌జిటికి దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే. పర్యావరణానికి ఇబ్బంది ఉన్న నేపథ్యంలో అనుమతులు ఇవ్వబోమని పేర్కొంటూ ఎన్‌జిటి ఆ దరఖాస్తును తిప్పి పంపింది. అనంతర పరిణామాల్లో రాష్ట్ర ప్రభుత్వం బనకచర్ల లింకులో భాగంగా బొల్లాపల్లి రిజర్వాయర్ తదితర వాటికి సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారీకోసం అనుభవం ఉన్న నిపుణులు దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచింది.

పూరణ్ కుమార్ ఆత్మహత్యపై న్యాయ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఎంఎ బేబీ నేతృత్వంలోని సిపిఎం ప్రతినిధి బృందం కలుసుకుంది, వారిని పరామర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో బి.వి.రాఘవులు (పొలిట్‌బ్యూరో సభ్యులు), ప్రేమ్‌చంద్ (హర్యానా రాష్ట్ర కమిటీ కార్యదర్శి), ఇందర్‌జిత్ సింగ్ (హర్యానా రాష్ట్ర మాజీ కార్యదర్శి), ఆర్.ఎల్.మౌద్గిల్ (పంజాబ్ రాష్ట్ర కమిటీ సభ్యులు) ఉన్నారు. ఆ పర్యటన ముగిసిన వెంటనే బేబీ ప్రధాని మోడీకి లేఖ రాశారు. పూరణ్ కుమార్ ఆత్మహత్య ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిం చిన విషయం తెలిసిందే. పైగా సమాజంలో వెనుకబడిన వర్గాలకు చెందిన అధికారులకు పోలీసు సర్వీస్‌లో అందుబాటులో వున్న రక్షణ యంత్రాం గాలు, జవాబుదారీతనం, పని పరిస్థితుల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తిందని ఆ లేఖ పేర్కొంది. ముఖ్యంగా అద్భుతమైన సర్వీసు రికార్డు కలిగిన దళిత అధికారి పూరణ్ కుమార్ ఇటువంటి తీవ్రమైన చర్యకు పాల్పడే పరిస్థితులు తలెత్తడం విచారకరమని ఆ లేఖ పేర్కొంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ దళిత విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఇంకా అనేకమంది దళిత విద్యార్థులు, అధికారులు భరించనలవికాని కుల వివక్ష, వ్యవస్థాగతమైన వేధింపులు కారణంగా తమ ప్రాణాలను బలవంతంగా తీసుకుంటున్న ఘటనలు చూస్తుంటే మన వ్యవస్థలను పట్టి పీడిస్తున్న వ్యవస్థాగత అణచివేత ఎలా వుందో తెలుస్తోందని ఆ లేఖ పేర్కొంది. తాము వ్యక్తిగతంగా వెళ్ళి చండీఘడ్‌లోని పూరణ్ కుటుంబ సభ్యులను కలిశామని, వారితో మాట్లాడి వారి ప్రగాఢమైన ఆవేదన, విచారం గురించి తెలుసుకున్నామని బేబీ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనలో వాస్తవాన్ని వెలికితీసి, న్యాయం జరిగేలా చూసేందుకు గానూ స్వతంత్ర, పారదర్శక విచారణ జరగాల్సి వుందని వారి మాటలను బట్టి స్పష్టమవుతోందని అన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని, పూరణ్ కుమార్ ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులపై అలాగే కుల వేధింపుల ఆరోపణలు, వ్యవస్థాగత తోడ్పాటు అందడంలో లోపాల గురించి దర్యాప్తు చేపట్టాలని ఆ లేఖ కోరింది. జ్యుడీషియల్ విచారణ నివేదిక వచ్చే వరకు పూరణ్ కుమార్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అధికారులందరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు క్రమాన్ని ఏ రకంగానూ ప్రభావితం చేయకుండా వుండేందుకు ఈ చర్య తీసుకోవడం తప్పనిసరని లేఖలో పేర్కొన్నారు. సక్రమ, పారదర్శక జ్యుడీషియల్ విచారణ వల్ల ఇప్పటికే మనోవేదనను అనుభవిస్తున్న ఆ కుటుంబానికి ఊరట కలగడమే కాకుండా రాజ్యాంగ విలువల పట్ల దేశ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులు ఏ రకమైన వివక్షను ఎదుర్కొనకుండా రక్షణ కల్పిస్తుందని ఆ లేఖ పేర్కొంది. ఈ విషయంలో ప్రధాని కార్యాలయం అత్యవసరంగా స్పందించి, తగు చర్యలు తీసుకోగలదని విశ్వసిస్తున్నామని కామ్రేడ్ బేబీ ఆ లేఖలో పేర్కొన్నారు.

జీవన సౌరభం


గెలవడంలో ఓడిపోవచ్చు గానీ, ప్రయత్నించడంలో ఓడిపోవద్దు.

మీ కోసం

ఇంట్లో వృధాగా మిగిలిపోయిన పెరుగు ప్యాకెట్లలోని పెరుగుతో రాగి, ఇత్తడి పాత్రలను తోమితే సులభంగా శుభ్రం అవుతాయి.



పర్యావరణహిత దీపావళి



'రాముా! ఏంటి, చాలా స్పీడ్‌గా వెళుతున్నావు?' అని తాతయ్య రాముని అడిగాడు. 'ఏమీ లేదు తాతయ్య..! దీపావళి వస్తుందిగా. మా ఫ్రెండ్స్ అంతా బాణాసంచా కొనుక్కుంటున్నారు. నేను కూడా వెళుతున్నా' అన్నాడు రాము.

'ఓ అవునా! మరి నీకు డబ్బులు ఎక్కడివి రాముా?' అని అడిగాడు తాతయ్య. 'నేను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బులతో కొనుక్కుంటా తాతయ్య' అని కళ్లుపెద్దవి చేసి చెప్పాడు రాము.

'సరే రాముా, అలాగే కొనుక్కో! అయితే, నేనొక మాట చెబుతా వింటావా.. ఒకప్పుడు దీపావళి పండుగ అంటే దీపాలు మాత్రమే వెలిగించే వాళ్ళు. కేవలం కాకర పువ్వొత్తులు వంటివి కాల్చేవాళ్ళు' అని చెప్పాడు తాతయ్య.

'అదేంటి తాతయ్య. ఇప్పుడు అందరూ పెద్ద పెద్ద బాంబులు, రాకెట్స్ పేలుస్తున్నారుగా!' అను మానంగా అడిగాడు రాము. 'అందుకే చెప్పేది రాముా, ఏ పండుగనైనా పర్యావరణహితంగా జరుపుకోవాలి. పెద్ద పెద్ద బాంబులు వల్ల శబ్ద కాలుష్యంతో పాటు, వాయు కాలుష్యం కూడా ఏర్పడుతుంది. పైగా ఖర్చు కూడా ఎక్కువ అవు తుంది' అని అర్థం అయ్యేలా తాతయ్య చెప్పాడు. 'అవునా తాతయ్య, అయితే నేను చిన్న చిన్న టపాసులు కొనుక్కుంటా. ఇదే విషయాన్ని మా ఫ్రెండ్స్‌కి కూడా చెబుతా' అని రాము పరుగెత్తుకుంటూ తన ఫ్రెండ్స్ దగ్గరకి వెళ్లాడు.

– యం. రాం ప్రదీప్,
జెవివి సభ్యులు, తిరువూరు,
94927 12836.



దారి కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో ఉన్న కోతిపిల్ల దాని ఆహారం అరటిపళ్లను చేరుకునే దారి కనిపెట్టండి.

నేను గీసిన బొమ్మ



పి.మేఘన,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూలు,
వడ్డేశ్వరం,
గుంటూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇటుకలు ఎత్తిన చేతుల్లో అక్షర కాంతులు..

చదువుకోవడం.. చాలామందికి చాలా సాధారణ విషయం. కానీ కొన్ని కుటుంబాల్లోని పిల్లలకి అది అందనంత దూరం. ముఖ్యంగా ఇటుకబట్టీల్లో పనిచేసే పిల్లలకి అదొక ఊహ మాత్రమే. ఒక్క పూట అన్నం తినడమే లగ్జరీ విషయంగా భావించే ఆ పిల్లలు పనిచేస్తేనే వాళ్ల కుటుంబాలు సజావుగా నడుస్తాయి. రెండుపూటలా తిండి తింటాయి. మరి ఆ పిల్లల చదువు కల ఎలా నెరవేరుతుంది? అటువంటి పిల్లలూ చదువు కోవాలని, సమాజంలో గౌరవంగా జీవించాలని కలలుగన్నాడు అన్షు జైస్వాల్. ఇటుకబట్టీలలో వలసకుటుంబాల జీవన పరిస్థితులని పరిశీలించేం దుకు వెళ్లిన అన్షు, అక్కడి పిల్లల పరిస్థితి చూసి తల్లడిల్లాడు. వాళ్ల చదువు కోసం ఏదైనా చేయాలని అప్పుడే గట్టిగా నిశ్చయించుకున్నాడు. 'నీవ్ కి ఈంట్ ఫౌండేషన్' ద్వారా ఆ పిల్లల చేతుల్లోని ఇటుకలని పుస్తకాలుగా మార్చాడు. ఇప్పుడు బీహార్‌లో ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న 3000 పైచిలుకు పిల్లలు అక్షరాలు నేర్చుకోవడం వెనుక అన్షు కృషి ఎంతో ఉంది.

జార్ఖండ్‌కి చెందిన అన్షు, ఓ ప్రాజెక్టు పని మీద బీహార్‌లోని ఇటుకబట్టీల కాంట్రాక్టర్స్‌ని కలవడానికి వెళ్లాడు. 'అక్షర లెర్నింగ్ సెంటర్స్' అనే ఆన్–సైట్ విద్యా కేంద్రాల గురించి వివరించడం, పిల్లలకి అక్షరాలు నేర్పించడం ఆ ప్రాజెక్టు లక్ష్యం. అప్పుడు తనకెదురైన అనుభవాన్ని అన్షు ఇలా చెప్పాడు. 'అందమైన ఇళ్లు కట్టడానికి ఎన్నో ఇటుకలు ఉపయోగిస్తాం. ఆ ఒక్కో ఇటుక వెనుక ఒక బాల్యం ఛిద్రమైపోతోందని ఎంతమందికి తెలుసు? నేను ఆ దారుణాన్ని ప్రత్యక్షంగా చూశాను. అక్కడ పిల్లలు చదువుకోవడం లేదని వారి తల్లిదండ్రులు అసలు బాధపడడం లేదు. పైగా 'పిల్లలు స్కూలుకి పోతే పనులు ఎవరు చేస్తారు? డబ్బులు ఎలా సంపాదిస్తాం?' అని ఎదురు ప్రశ్నించారు. ఇక కాంట్రాక్టరు అయితే.. 'మీరు ఈ పిల్లలకి చదువు చెబితే.. ఈ పని చేయడానికి మా పిల్లలు ఇక్కడికి వస్తారా?' అని చాలా గట్టిగా మాట్లాడారు. అప్పుడే అర్థమైంది.. ఈ పిల్లలు చదువుకోవడం చాలా కష్టమని..! ఇక్కడ పిల్లలకి అంకెలు లెక్కబెట్టడం వచ్చు. మండుటెండలో ఆరబెట్టిన ఇటుకలని లెక్కించే క్రమంలోనే వాటిని నేర్చుకున్నారు. నేను ఆ అంకెలనే సరైన క్రమంలో నేర్పిస్తానని చెప్పాను' అని చెప్పారు.



గౌరవప్రదమైన ఆహారం దొరకదు..


అన్షు పరిశీలనలో కోవిడ్ తరువాత వలసకార్మికుల పిల్లలు చదువుకి ఎక్కువగా దూరమయ్యారన్న అవగాహన వచ్చింది. ఇటుకబట్టీల్లో పనిచేసే కుటుంబాలు ముషార్ కమ్యూనిటీకి చెందినవి. సాధారణంగా ఆ కుటుంబాలు ఎలుకలు, నత్తలు, బొద్దింకలు వంటివి పట్టుకుని ఆహారంగా తింటారు. గౌరవప్రదమైన ఆహారం దొరకడం వాళ్లకి కష్టం. ఆ కుటుంబాల్లోని పిల్లలు పనిచేయడం వాళ్లకి ప్రధాన ఆదాయవనరు. ఈ భావననే అన్షు పోగొట్టాలనుకున్నారు. మండుటెండలో ఇటుక బట్టీల్లో నలిగిపోతున్న ఆ పిల్లల బాల్యాన్ని వాళ్లకి తిరిగి ఇచ్చేయాలనుకున్నారు.

ఆ గాలి ఇప్పుడు తనకి కొత్త..

బీహార్‌లోని 'ససరన్' ఇటుకబట్టీలో ఓ మూల 10 ఏళ్ల చాందినీ కూర్చొని ఉంది. అప్పుడే గట్టిగా వీచిన గాలికి దుమ్ము కణాలు పైకిలేచాయి. అవి చాందినీ ముక్కుని తాగినప్పుడు తను గట్టిగా దగ్గింది. ఇది చాలా సాధారణ విషయం. కానీ చాందినీకి ఇది చాలా కొత్త. గతంలో తనకి ఇలా లేదు. కాళ్లకి చెప్పులు లేకుండా, ఎండకి ఎండిపోతూ, రోజుకి 12 నుండి 15 గంటలు ఆ గాలిలో తను పనిచేసింది. ఇప్పుడు మాత్రం ఆ బట్టీకి దూరంగా పుస్తకాల సంచి ముందేసుకుని పలకమీద అక్షరాలు దిద్దుతోంది. అందుకే ఆ దుమ్ము ఇప్పుడు తనని ఇబ్బంది పెడుతోంది.

'పనికి వెళ్లకపోతే తిండి ఎలా?' అనేవారు..

'ఒక్క రాత్రిలో చాందినీ జీవితం మారి పోయింద'ని ఆ ఇటుకబట్టీలో వాలంటీర్‌గా విద్యని బోధిస్తున్న ఓ యువతి చెబుతోంది. ఒక రోజు చాందినీ అన్న మాటలని తను ఇలా గుర్తు చేసుకుంది. 'చదువుకోవాలని నాకు కోరికగా ఉండేది. కానీ అమ్మా నాన్న నాతో ఇలా అనేవారు. 'చాందినీ నువ్వు ఇటుకలు తయారుచేయకపోతే మనం ఏం తింటాం? ఆకలితో పడుకోవాలి. కాబట్టి నువ్వు పనికి వెళ్లు' అని చెప్పేవారు. చాందినీ చెప్పిన విషయాలు అక్కడ ఎంతోమంది పిల్లలవి. బాలకార్మికులుగా మారిపోతున్న ప్రతి ఒక్క చిన్నారివి.





లక్ష్యం ఇంకా ఉంది..

అన్షు లక్ష్యాలలో ఆ పిల్లల బాల్యాన్ని తిరిగి ఇవ్వడమే కాదు.. వారి కుటుంబాల సామాజిక అస్తిత్వాన్ని కాపాడడం కూడా ఉంది. ప్రభుత్వాల నుండి ఏదైనా సాయం పొందాలంటే వాళ్ల దగ్గర సరైన గుర్తింపు పత్రాలు ఉండవు. దీంతో వాళ్లకి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు వంటివి కల్పించడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నాడు. 'వాళ్లకి ఉన్న అవకాశాలు, హక్కులు తెలియకపోవడం వల్లే దోపిడీకి గురవుతున్నారు' అంటారు అన్షు ఎంతో ఆవేదనగా.

2023లో స్థాపించిన తన సంస్థ 'ప్రతి చిన్నారి చదువుకోవాలి. ప్రతి కార్మికుడు గౌరవంగా జీవించాలి, ప్రతి ఒక్క కుటుంబం స్వేచ్ఛగా ఉండాలి' అన్న నినాదాలతో పనిచేస్తోంది. అన్షు మాటల్లో చెప్పాలంటే 'అవగాహన, చదువు, సాధికారత' అనాలి.

ఆ పిల్లలూ అక్షరాలు దిద్దాలని..

'5 నుండి 14 ఏళ్ల లోపు పిల్లల్లో 65 నుండి 80 శాతం పిల్లలు ఇటుకబట్టీల్లో 9 గంటలు పనిచేస్తున్నార'ని 'యాంటీ స్లేవరీ ఇంటర్నేషనల్ ఫౌండ్' అనే డాక్యుమెంటరీలో చూపించారు. అది అందించిన రిపోర్టు ప్రకారం ఇటుకబట్టీల్లో పనిచేసే కార్మికుల్లో 77 శాతం మంది తమ పిల్లలకి ప్రాథమిక విద్య అందడం లేదని వాపోయారు. ఈ లెక్కన దేశవ్యాప్తంగా లక్ష నుండి రెండు లక్షలకి పైగా ఉన్న ఇటుకబట్టీల్లో ఉన్న పిల్లల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

తనకి స్ఫూర్తి ఇచ్చిన విషయాల గురించి అన్షు ఇలా చెబుతున్నారు. 'ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న పిల్లల విద్య కోసం దేశవ్యాప్తంగా ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. 'అక్షర లెర్నింగ్ సెంటర్' అందులో ఒకటి. నేను ఇప్పుడు ఇందులో భాగమయ్యాను. ఇక్కడ నిర్వహించే విద్యా కేంద్రాలు ప్రాథమిక విద్య అభ్యసించేందుకు ఈ పిల్లలు వేసే తొలి అడుగులు. మా లక్ష్యం కూడా అదే. ఇక్కడ నేర్చుకున్న అక్షరాలతో ఆ పిల్లలు ప్రధాన స్రవంతి స్కూళ్లవైపు నడవాలి. అప్పుడే మా లక్ష్యం నెరవేరుతుంది. 2011 గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం బాలల జనాభా సంఖ్యలో 5 నుండి 14 ఏళ్ల లోపు దాదాపు 26 కోట్ల మంది ఉన్నారు. వారిలో కోటి మందికి పైగా బాలకార్మికులుగా వివిధ పనులు చేస్తున్నారు. 4 కోట్ల 27 లక్షలమందికి పైగా బడి బయట జీవితం గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో అన్షు లాంటి యువకుడు తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకం.

ఆబాల గాన సరస్వతి..



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి మహిళా సింగర్ రావు బాలసరస్వతి దేవి (97) బుధవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్య సమస్యలతోపాటుగా అనారోగ్యంతో ఆమె గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. 1928లో పుట్టిన ఆమె ఆరేళ్ల వయస్సు నుంచే పాటలు పాడటం మొదలు పెట్టారు. మొదటగా రేడియోలో ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగువారికి పరిచయమయ్యారు.

గుంటూరులో బాల్యం..

మద్రాస్‌లో పుట్టిన బాల సరస్వతి, 1934 నాటికి అంటే తన ఐదవ ఏట గుంటూరుకి చేరుకున్నారు.అక్కడ వీరికి 'రత్న మహల్' అనే సినిమా థియేటర్ వుండేది. 1936 నాటికి ఆ థియేటర్‌ని నాటకరంగ స్థలంగా మార్చారు. అక్కడే సరస్వతి కుటుంబం పలు నాటకాలు ప్రదర్శించేవారు. ఆనాటకాల్లో పాటల సన్నివేశాలు వచ్చినప్పుడు సరస్వతి ఆలపించేవారు. గుంటూరులోనే కర్నాటక సంగీతం సాధన చేశారు. కర్నాటక సంగీతంలో ప్రావీణ్యుడైన తండ్రి చొరవతో బొంబాయిలో హిందూస్తానీ సంగీతం కూడా నేర్చుకున్నారు. ఆరో ఏట ఒకసారి నాటకంలో పాటలు పాడుతున్న సరస్వతి గానాన్ని,హెచ్‌ఎంవి కంపెనీ గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. చిన్న వయసులో పాటలు పాడుతున్న ఈమెని బాల సరస్వతి అని పిలిచేవారు.

సినిమాల్లో..

'సతీ అనసూయ' (1936) సినిమాలో తొలిసారి సరస్వతి పాట పాడారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ భాషల్లోనూ అనేక పాటలు ఆలపించారు. దాదాపు రెండువేలకి పైగా పాటలు పాడిన గొప్ప చరిత్ర ఆమెది. తెలుగులో తొలి నేపథ్య గాయని రికార్డు కూడా తనదే. భక్త ధ్రువ, ఇల్లాలు, రాధిక వంటి పలు తెలుగు చిత్రాలతో పాటు తమిళ సినిమాల్లోనూ ఆమె నటించారు.

వివాహం..

1944 నాటికి తిరిగి మద్రాసు చేరుకున్న బాలసరస్వతికి కోలంక రాజావారితో వివాహం చేశారు. పెళ్లి తరువాత కూడా తన పాటల ప్రవాహానికి అడ్డురానని మాట ఇచ్చిన భర్త ఆ తరువాత ఆమెపై నిర్బంధం పెట్టారు. సరస్వతి పాడిన హిట్‌సాంగ్స్ గురించి ప్రస్తావిస్తూ తన ఫొటోతో ఓ పత్రికలో అచ్చయ్యింది. ఆ రోజుల్లో అది అవమానంగా భావించిన రాజావారు ఆమె ఇక పాటలు పాడకూడదని షరతు పెట్టారు.

పెళ్లి తర్వాత సినిమాల్లో పాడటం మానేశారు. కానీ గొంతు సవరించుకోవడం ఆపలేదు. పుట్టింటికి వచ్చినప్పుడల్లా పాటలు పాడేవారు. ప్రసిద్ధ సంగీత దర్శకులు ఎస్. రాజేశ్వరరావుతో కలిసి ఎన్నో లలిత గీతాలు పాడారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, ఆరుద్ర, ఇంద్రగంటి హనుమఛ్ఛాస్త్రి, బాలాంత్రపు రజనీకాంతారావు రచించిన ఎన్నో గేయాలు రేడియోలో పాడారు

. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారు. కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. అలా చివరి వరకు పాడుతూనే ఉన్నారు. బాలసరస్వతి మృతికి తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు పెద్దలు, ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతిపట్ల తెలుగు చిత్రసీమ సంతాపం వ్యక్తం చేసింది.



'సంబరాల ఏటిగట్టు' గ్లింప్స్ విడుదల

కథానాయకుడు సాయి దుర్గాతేజ్ నటించిన సినిమా 'సంబరాల ఏటిగట్టు'. ఈ సినిమా నుంచి విడుదల చేసిన గ్లింప్స్ బాగా ఆకట్టుకునేలా ఉన్నాయి. సాయితేజ్ పుట్టినరోజు సందర్భంగా ఇప్పుడు గ్లింప్స్‌ను నిర్మాతలు విడుదల చేశారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నారు. గ్లింప్స్‌ని బట్టి చూస్తే మాస్‌యాక్షన్ మూవీ అని క్లారిటీ వచ్చింది. అయితే విజువల్స్ అన్నీ 'కేజీఎఫ్'లో నరాచీని గుర్తుచేసేలా కనిపించాయి. సాయితేజ్ బాడీ బిల్డింగ్ అవతార్‌లో కనిపించారు. గ్లింప్స్‌లోనూ కథ ఎలా ఉండబోతుందనే రివీల్ చేశారు. లెక్క ప్రకారం గత నెలలోనే సినిమా రిలీజ్ చేస్తామని చాన్నాళ్ల క్రితం ప్రకటించారు. కానీ షూటింగ్ ఆలస్యమైన కారణంగా సినిమా విడుదల కాలేదు. తాజాగా గ్లింప్స్‌లో కూడా మూవీ రిలీజ్ డేట్ ఇవ్వలేదు. సినిమా ఏ తేదీన విడుదల చేస్తామనేది త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెబుతున్నారు.



పంకజ్ ధార్ మృతి

మహాభారత్ సీరియల్‌లో కర్ణుడి పాత్ర పోషించిన ప్రఖ్యాత నటుడు, టీవీ స్టార్ పంకజ్ ధీర్ (68) తుదిశ్వాస విడిచారు. ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఫ్యాంటసీ డ్రామా చంద్రకాంతలో శివదత్తు చక్రవర్తి పాత్రను ఆయన పోషించారు.గత కొన్ని నెలల నుంచి ఆయన చికిత్స తీసుకుంటున్నట్లు ప్రొడ్యూసర్ అశోక్ పండిట్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగాయి. పంజాబ్‌కు చెందిన ధీర్ 1980 దశకంలో నటుడిగా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. చాలా వరకు సినిమాల్లో చిన్న పాత్రలు పోషించేవారు. అయితే దూరదర్శన్ టీవీలో 1988లో ప్రసారమైన మహాభారత్ సీరియల్‌లో కర్ణుడి పాత్రను ఆయన పోషించారు. ఆ సీరియల్ తర్వాత ఆయన పాపులార్టీ చాలా పెరిగిపోయింది. ఆ తర్వాత సడక్, సనమ్ బెవఫా, ఆశిక్ అవారా లాంటి చిత్రాల్లో నటించారు. 1994 నుంచి 1996 వరకు చంద్రకాంత టీవీ సీరియల్‌లో నటించారు. 1888లో రాసిన దేవకి నందన్ ఖత్రి పుస్తకం ఆధారంగా ఆ సీరియల్‌ను తీశారు. దాంట్లో శివదత్తు పాత్రను పోషించారు. బాబీ డియోల్ నటించిన సోల్జర్, షారూక్‌ఖాన్ నటించిన బాద్‌షా, అక్షయ్‌కుమార్ నటించిన అందాజ్, అజయ్ దేవన్ నటించిన జమీన, టార్జన్ చిత్రాల్లోనూ పంకజ్ ధీర్ నటించారు. తీన్ బహురాణియాన్, రాజా కీ ఆయేగీ బరాత్, ససురాల్ సిమర్ కా లాంటి టీవీ షోల్లోనూ కూడా ధీర్ నటించారు. భార్య అనితా ధీర్, కుమారుడు నికితిన్ ధీర్ ఉన్నారు.పంకజ్ ధీర్ మృతికి బాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం తెలిపారు.

2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం

- నిర్వహణ హక్కులు సొంతం
- నవంబర్ 26న అధికారికంగా ప్రకటన



న్యూఢిల్లీ: భారత్ మరోసారి అంతర్జాతీయ క్రీడా వేదికగా నిలవనుంది. 2030 శతాబ్ది కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణ హక్కులను భారత్ దక్కించుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని వేదికగా ఎంపిక చేస్తూ కామన్‌వెల్త్ స్పోర్ట్ బాడీ బుధవారం నిర్ణయం తీసుకుంది. లక్షా 32 వేల సామర్థ్యం కలిగిన నరేంద్ర మోడీ స్టేడియంలో 2030 కామన్వెల్త్ క్రీడలు జరగనున్నాయి. నైజీరియాలోని అబూజా నగరంతో పోటీపడిన భారత్.. ఆతిథ్య హక్కులు దక్కించుకుంది. కామన్వెల్త్ స్పోర్ట్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో.. "సాంకేతిక నిర్వహణ, అథ్లెట్ల అనుభవం, మౌలిక సదుపాయాలు, పరిపాలన, కామన్వెల్త్ స్పోర్ట్ విలువలతో పొందిక వంటి విస్తృత శ్రేణి ప్రమాణాల ఆధారంగా తాము ఆతిథ్య నగరాన్ని ఎంపిక చేసినట్లు, భారత్‌లో అన్నిరకాల ప్రమాణాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొంది. నవంబర్ 26న గ్లాస్గోలో జరగనున్న జనరల్ అసెంబ్లీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. అలాగే 2034 భవిష్యత్తు క్రీడల కోసం నైజీరియా ఆతిథ్య ఆశయాలకు మద్దతు ఇవ్వడానికి, వేగవంతం చేయడానికి ఒక వ్యూహాన్ని అభివృద్ధి చేయడానికి కామన్వెల్త్ స్పోర్ట్ ఎగ్జిక్యూటివ్ బోర్డు అంగీకరించిందని తెలిపింది. కామన్‌వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులను దక్కించుకోవడం భారత్‌కు ఇది రెండోసారి. 2010లో న్యూఢిల్లీ వేదికగా భారత్‌లో తొలిసారి ఈ క్రీడలు జరిగాయి. 2030 గేమ్స్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఇవి శతాబ్ది వేడుకలుగా జరగనున్నాయి. 1930లో తొలిసారి కెనడాలోని హామిల్టన్‌లో ఈ క్రీడలు జరిగాయి. భారత్‌కు కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ అవకాశం దక్కడంపై కామన్‌వెల్త్ గేమ్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు పి.టి. ఉష స్పందిస్తూ.. 2030 కామన్‌వెల్త్ గేమ్స్ భారత యువతకు ప్రేరణగా నిలుస్తాయని, ఈ క్రీడల నిర్వహణ కామన్‌వెల్త్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలపరిచే గొప్ప అవకాశంగా పేర్కొన్నారు.

కాగా, 72వ కామన్‌వెల్త్ గేమ్స్–2022 ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరగ్గా.. 2026 కామన్వెల్త్ గేమ్స్ స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరం ఆతిథ్యమివ్వనుంది. ఇక నైజీరియాలోని అబూజాకు కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్య హక్కులు దక్కకపోవడం ఇది రెండోసారి. గతంలో 2014 ఎడిషన్‌కు ఆతిథ్యం విషయంలో గ్లాస్గోకు అవకాశం దక్కింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం ఆర్థిక కారణాల వల్ల వైదొలగడంతో, గ్లాస్గో 2026 ఆతిథ్యమిచ్చేందుకు ముందుకు రాగా.. అంతకుముందు, దక్షిణాఫ్రికాలోని డర్బన్ నగరం వైదొలగడంతో 2022 క్రీడలను బర్మింగ్‌హామ్ నిర్వహించింది.

గోల్డెన్ రైడ్‌లో తెలుగు టైటాన్స్ ఓటమి



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ రసవత్తరంగా సాగుతున్నాయి. త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో తెలుగు టైటాన్స్, బెంగాల్ వారియర్స్ జట్ల మధ్య నువ్వా–నేనా అన్నట్లు జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో టైటాన్స్ గోల్డెన్ రైడ్‌లో ఓటమిపాలైంది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 45–45పాయింట్లతో సమంగా నిలిచాయి. ఈ క్రమంలో టై బ్రేకర్‌ను నిర్ణయించగా.. అందులోనూ ఇరుజట్లు 5–5పాయింట్లతో సమంగా నిలిచాయి. గోల్డెన్ రైడ్‌లో బెంగాల్ రైడర్ రెండు పాయింట్లు సాధించడంతో టైటాన్స్ ఓటమిపాలైంది. ఇక టైటాన్స్ జట్టు ఆల్‌రౌండర్ భరత్(16పాయింట్లు) సత్తా చాటగా.. కెప్టెన్ విజయ్ మాలిక్(6) రాణించలేకపోయాడు. డిఫెండర్లు శుభమ్ షిండే(4), అవి దుహాన్(4) రాణించారు. ఇక బెంగాల్ జట్టులో కెప్టెన్ దేవంక్(18) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చగా.. మరో రైడర్ హిమాన్షు(5) ఫర్వాలేదనిపించాడు. ఇక డిఫెండర్ మంజిత్(7) సత్తా చాటాడు. ఈ గెలుపుతో బెంగాల్ వారియర్స్ 10పాయింట్లతో 11వ స్థానంలో నిలిచినా.. టైటాన్స్ జట్టు 14మ్యాచ్‌లు ముగిసేసరికి 16పాయింట్లతో 3వ స్థానంలో కొనసాగుతోంది. పుణేరి పల్టన్స్, దబాంగ్ ఢిల్లీ జట్లు 24పాయింట్లతో నాకౌట్‌కు చేరాయి.

ప్రొ కబడ్డీలో నేడు...

బెంగళూరు బుల్స్ × పట్నా పైరెట్స్(రాత్రి 7.30గం॥లకు)
తెలుగు టైటాన్స్ × యు ముంబ(రాత్రి 8.30గం॥లకు)
యుపి యోధాస్ × హర్యానా స్టీలర్స్(రాత్రి 9.30గం॥లకు)

తొలి టెస్ట్‌లో పాకిస్తాన్ గెలుపు

లాహోర్: తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికాపై పాకిస్తాన్ జట్టు 93పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 277 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా జట్టు నాల్గోరోజు 189 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 51పరుగులతో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికాను షాహిన్ అఫ్రిది(4/33), నొమన్ అలీ(4/79) దెబ్బ కొట్టారు. సాజిద్ ఖాన్(2/38) కూడా రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు 183పరుగులకే ఆలౌటైంది. సఫారీ బ్యాటర్లలో బ్రెవీస్(54), అర్ధసెంచరీకి తోడు రికెల్టన్(45) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నొమన్ అలీకి లభించింది. రెండో, చివరి టెస్ట్ రావల్పిండి వేదికగా 20నుంచి ప్రారంభం కానుంది. దీంతో డబ్ల్యూటిసి 2025–27 తాజా ఎడిషన్‌లో తొలి గెలుపు నమోదు చేసిన పాకిస్తాన్ జట్టు వందకు వంద విజయ శాతంతో టాప్–2లోకి చేరుకుంది. ఆస్ట్రేలియా అగ్రస్థానంలోనే ఉంది.

హర్మన్‌ప్రీత్ సేనకు జరిమానా

దుబాయ్: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆస్ట్రేలియాతో మ్యాచ్ సందర్భంగా స్లో ఓవర్ రేట్ కారణంగా భారత ఆటగాళ్ల మ్యాచ్ ఫీజ్‌ల్లో 5 శాతం కోత విధిస్తున్నట్లు ఐసిసి బుధవారం ప్రకటించింది. నిర్దేశిత సమయంలోగా భారత బౌలర్లు ఓ ఓవర్ వెనుకపడి ఉండటంతో ఐసిసి ఈ జరిమానా విధించింది. ఐసిసి కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో ఆర్టికల్ 2.22 నిబంధన ప్రకారం నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయని ప్రతి ఓవర్‌కు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజ్‌లో 5 శాతం కోత విధిస్తారు. టోర్నీ ప్రారంభంలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన టీమిండియా.. ఆతర్వాత వరుసగా సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా చేతుల్లో పరాజయాలను చవిచూసింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో భారత్ గెలిచే స్థితిలో నిలిచి మరీ ఓటమిపాలైంది. ముఖ్యంగా ఆసీస్‌తో మ్యాచ్‌లో భారత్ 330 పరుగులు చేసి మరీ ఓటమిపాలైంది. దక్షిణాఫ్రికా మహిళలతో మ్యాచ్‌లో బౌలర్ల వైఫల్యం కారణంగా చేతిలోకి వచ్చిన మ్యాచ్ చేజారింది. ఇదిలా ఉంటే, ప్రస్తుత ప్రపంచ కప్‌లో భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ అక్టోబర్ 19న ఇండోర్‌లో జరుగనుంది. ఈ టోర్నీలో భారత్ నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా జట్లు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.



మహాసభలో ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్



మహాసభల ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఐద్వా నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సావిత్రి

ఐక్యతే ఐద్వా బలం

సమానత్వం కోసం పోరు సాగించాలి
ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్
ముగిసిన 16వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పీడిత ప్రజలను ఐక్యపరిచి పోరాడడమే బలమవ్వాలని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాలులో మూడు రోజులపాటు జరిగిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ బుధవారంతో ముగిసింది. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను మహాసభలో నిర్ణయించారు. చివరి రోజు చర్చల అనంతరం ప్రతినిధులనుద్దేశించి శ్రీమతి టీచరు ప్రసంగించారు. 1981 మద్రాసులో ఐద్వా ఆరంభమైందని, ఈ నాలుగు దశాబ్దాల కాలంలో ఎంతగానో విస్తరిస్తూ వచ్చిందని వివరించారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మహిళా పోరాటాలు వీరోచితంగా జరిగాయని గుర్తు చేశారు.

మల్లు స్వరాజ్యం లాంటి వారు భూమి కోసం పెద్దఎత్తున పోరాటాన్ని సాగించారని గుర్తుచేశారు. దేశంలో మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వేతనాల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. ఇప్పటికీ దేశంలో 40 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఒక్క సంవత్సరంలోనే మూడు లక్షల మంది పిల్లలు బడి నుంచి బయటకు వెళ్లారని నివేదికలు చెబుతున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలకు తోడు మతతత్వ పార్టీలు తోడవ్వడంతో మహిళల హక్కులు హరించే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మహిళలను మరింతగా సమైక్యపరచి పోరాడాల్సిన అవసరముందన్నారు. కేరళ రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందని వివరించారు. ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి మాట్లాడుతూ... ఐద్వా సంఘంలో పనిచేసే కార్యకర్తలు చైతన్యవంతమవ్వాలని సూచించారు. సమస్యలను అధ్యయనం చేయడం, వాటిపై ప్రజలను కదిలించి పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా సంఘ విస్తరణకు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

రెండు పుస్తకాలు ఆవిష్కరణ

మహాసభ సందర్భంగా రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. 'ది ఫస్ట్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఆంధ్ర మహిళా సభ, తెలంగాణ పోరాటంలో మహిళల వీరోచిత పోరాటం' పుస్తకాలను ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే చేతుల మీదుగా ఆవిష్కరించారు.

పలు అంశాలపై సబ్‌కమిటీల చర్చ

కర్తవ్యాలను నిర్ణయించుకోవడంలో భాగంగా సమస్యలపై చర్చించేందుకు సబ్‌కమిటీలు ఏర్పాటు చేశారు. విద్య, వైద్యం, సోషల్ మీడియా, మహిళలపై జరుగుతున్న హింస, డ్వాక్రా సంఘాల్లోని సమస్యలు, మైక్రోఫైనాన్స్, మద్యం వల్ల నష్టపోతున్న కుటుంబాల అంశాలపై చర్చించారు. అనంతరం ఆయా విభాగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి ఏ రకమైన ప్రయత్నం జరగాలన్న దానిపై సబ్‌కమిటీ చర్చించింది.

పది అంశాలపై తీర్మానాలు

మైక్రో ఫైనాన్స్ సంస్థ దోపిడీ నుంచి కుటుంబాలను కాపాడాలని, ఆ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ, వడ్డీ రేట్లు తగ్గించాలని తీర్మానించారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు, బ్యాంకు ప్రాసెసింగ్ ఛార్జీలను గ్రూపు మహిళలకు మినహాయించాలని, డ్వాక్రా సంఘాల్లో అవినీతిని అరికట్టే చర్యలు చేపట్టాలని, మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌లను అరికట్టాలని, అందుకు పటిష్టమైన చట్టం చేయాలని, సూపర్ సిక్స్ హామీని నిలబెట్టుకోవాలని, జిఒ నంబర్ 3కి చట్టబద్ధత, విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేయాలని, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, మద్యం మత్తును నియంత్రించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, 14 రకాల సరుకులు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు, ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని తీర్మానించారు.

హౌసింగ్ ఎమ్‌డిగా అరుణ్‌బాబు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఎమ్‌డిగా పి అరుణ్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా పేదలందరికీ పక్కా గృహాలను నిర్మించడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు. సిఎం చేతుల మీదుగా త్వరలో 3 లక్షల గృహాల ప్రారంభోత్సవం ఉంటుందని, ఈలోగా ఆయా గృహాలన్నింటినీ నూటికి నూరు శాతం లబ్ధిదారులకు అందించేలా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ జయరామాచారి, చీఫ్ జనరల్ మేనేజరు ఎన్ అన్నపూర్ణ, జనరల్ మేనేజరు వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో పరిశ్రమలు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటయ్యేలా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధాని అమరావతి పరిధిలో నిర్మించనున్న 12 బ్యాంకుల కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ త్వరలో శంకుస్థాపన చేస్తారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం రూ.13 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని పేర్కొన్నారు.

పే స్కేల్ కోసం రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సిద్ధం

- ఎపి విఆర్‌ఎల సంఘం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎ) శ్రమకు తగిన విధంగా పే స్కేల్ జీతాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సిద్ధం కావాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపునిచ్చింది. ఎనిమిదేళ్లుగా జీతాలు పెంచకుండా విఆర్‌ఎలను మోసం చేస్తున్న పాలకుల విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆదోళనలు, పోరాటాలను ఉధృతం చేయాలని సంఘం ఆధ్వర్యాన బుధవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో తీర్మానించింది. విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. మూడో రోజైన బుధవారం నిర్వహించిన మహాధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో విఆర్‌ఎలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ అధ్యక్షతన జరిగిన సభలో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విఆర్‌ఎలను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2047 విజన్ గురించి చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. విఆర్‌ఎల కుటుంబాల పస్తుల గురించి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో విఆర్‌ఎలను రెవెన్యూశాఖ ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ జీతాలు ఇస్తుండగా, ఇక్కడ మాత్రం కేవలం నెలకు రూ.11 వేలు ఇచ్చి పాలకులు చేతులు దులిపేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో లక్షలాది పోస్టులు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోక ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయడం లేదన్నారు. విఆర్‌ఎలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి పిడిఎఫ్, జనవిజ్ఞాన వేదిక సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.



విఆర్‌ఎల ఆందోళనలో ప్రసంగిస్తున్న కెఎస్ లక్ష్మణ్‌రావు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు విఎఆర్‌ఎల న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. విఆర్‌ఎల సంఘం ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. విఆర్‌ఎల కుటుంబాలను ఆదుకుంటామని ఎన్నికలకు ముందు హామీలివ్వడం, తీరా గద్దెనెక్కాక ఇచ్చిన హామీలను అటకెక్కించడం పాలకులకు పరిపాటిగా మారిందని తెలిపారు. కూటమి పాలనలో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, కాని నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలకు నైట్ డ్యూటీలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల ప్రాణాలకు హాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడాన్ని ఆయన ఖండించారు. విఆర్‌ఎల డిమాండ్ల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. పోరాటాల్లో కలిసొచ్చే సంఘాలను కలుపుకొని భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు పూనుకుంటామని ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తున్న రూ.11 వేలతో బతకలేక విఆర్‌ఎల కుటుంబాలు ఆకలితో అల్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలతో నైట్ డ్యూటీలు, అటెండర్, వాచ్‌మెన్ తదితర పనులు చేయించుకుంటూ టిఎ, డిఎలు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో 70 శాతం పోస్టులను విఆర్‌ఎలకు కేటాయించి భర్తీ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో తహశీల్దారు, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద పెద్దయెత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు టి త్రినాథరావు, సుబ్బన్న, లచ్చన్న, నాగేంద్ర, గురుమూర్తి, కృష్ణారావు, సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శులు శేఖర్ రెడ్డి, జ్యోతి, కె రవికుమార్, కొండబాబు, రమణ, సుధాకర్, బాజిబాబు, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

భూములు పోయే... ఉపాధీ పాయే

పరిశ్రమల పేరుతో కార్పొరేట్లకు 7,464 ఎకరాలు ధారాదత్తం
1,200 ఎకరాల్లో మాత్రమే ఫార్మా కంపెనీలు
మిగిలిన భూములు ఖాళీగానే



సోంపేటలో ఖాళీగా ఉన్న ఎన్‌సిసికి కేటాయించిన భూములు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉద్యోగాలు, అభివృద్ధి పేరుతో శ్రీకాకుళం జిల్లాలో రెండు థర్మల్ పవర్ ప్లాంట్లు, ఒక అణు విద్యుత్కేంద్రం, ఫార్మా కంపెనీల ఏర్పాటు పేరుతో పాలకులు 7,464 ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెట్టారు. ఇందులో 1,200 ఎకరాల్లో మాత్రమే ఫార్మా కంపెనీలు వచ్చాయి. మిగిలిన 6,264 ఎకరాలు నేటికీ ఖాళీగానే ఉన్నాయి. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించకపోయినా ప్రభుత్వం బలవంతంగా లాక్కొంది. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి సోంపేటలో 2008లో 1,545 ఎకరాలను ధారాదత్తం చేసింది. కాలుష్య కారక థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించిన ప్రజలపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్పులకు తెగబడి ముగ్గురిని పొట్టనపెట్టుకుంది. ఆ తర్వాత 2016లో థర్మల్ పవర్ ప్లాంట్ అనుమతులను ప్రభుత్వం రద్దు చేసింది. అప్పట్నుంచి ఈ భూములు ఖాళీగా ఉన్నాయి. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో 2,640 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం 2008లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 2,050 ఎకరాలను కట్టబెట్టింది. బలవంతపు భూసేకరణకు, ప్లాంట్‌కు వ్యతిరేకంగా రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించినా ప్రభుతం వెనక్కి తగ్గకపోగా కాల్పులకు సైతం తెగబడి ముగ్గురిని బలి తీసుకుంది. చివరకు కంపెనీ దివాళా తీసి హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీకి అమ్మేసింది. రణస్థలం మండలం కొవ్వాడలో అణు విద్యుత్కేంద్రం ఏర్పాటుకు 2016లో అప్పటి టిడిపి ప్రభుత్వం న్యూక్లియర్ పవర్ ప్లాంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పిసిఐఎల్)కు 2079.66 ఎకరాలను కట్టబెట్టింది. ప్రమాదకరమైన అణు విద్యుత్కేంద్రం వద్దంటూ ప్రజలు, రైతులు ఉద్యమించినా ప్రభుత్వం లెక్క చేయలేదు. న్యూక్లియర్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కాకపోవడంతో ఆ భూములను వేరే పారిశ్రామిక అవసరాలకు వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఫార్మా కంపెనీలకు లాభాలు... ప్రజలకు వ్యాధులు

పైడిభీమవరం, ఎచ్చెర్ల ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమల కోసం ప్రభుత్వం 1200 ఎకరాలను బలవంతంగా సేకరించింది. ఈ ప్రాంతాల్లో ఏర్పాటైన ఫార్మా పరిశ్రమలు తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ప్రధానంగా రణస్థలం మండలంలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో, సరాకా లేబొరేటరీస్, ఆంధ్రా ఆర్గానిక్స్, వికెటి ఫార్మా, ల్యాన్‌టెక్ ఫార్మాస్యూటికల్స్, ఎచ్చెర్లలోని స్మార్ట్‌కెమ్ టెక్నాలజీస్, నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ పరిశ్రమలు తీవ్ర కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయి. వీటిలో రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో, ఆంధ్రా ఆర్గానిక్స్ నేరుగా పైపుల ద్వారా కాలుష్య కారక వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి విడిచిపెడుతున్నాయని, దీంతో, మత్స్య సంపద చనిపోయి తమ ఉపాధికి గండి పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి మత్స్యకారులు గుజరాత్‌లోని వీరావల్, తమిళనాడు, ముంబయి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారు. కొందరు మత్స్యకారులు వేట మానుకుని ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్ తదితర ప్రాంతాల్లో ఊయళ్లు, టోపీలు విక్రయించి జీవనం గడుపుతున్నారు. ఎచ్చెర్ల మండలంలోని ఎన్‌ఎసిఎల్ ఫార్మా పరిశ్రమ వల్ల సమీప గ్రామాలైన కేశవదాసుపురం, భగవాన్‌దాసుపేట, నరసాపురం అగ్రహారం, నందివాడ, బురిడికంచరాం, లోలుగు తదితర గ్రామాల ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడ్డారు. అరబిందో, రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమలు విడుదల చేసే విష రసాయనాలతో రణస్థలం మండలం పైడిభీమవరం, వరిశాం, ముక్కుపాలవలస, దేవునిపాలవలస, సంచాం తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితం కావడంతో స్థానిక ప్రజలు వాటర్ కేన్‌లను కొనుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఫార్మా కంపెనీలు విపరీతంగా నీటిని తోడేయడంతో రణస్థలం మండలంలోని 30 గ్రామాల్లో భూగర్భ జలాల వాడకంపై ప్రభుత్వం నిషేధించింది. వర్షాధారంపై ఆధారపడే ఇక్కడి రైతులకు బోర్లు తవ్వి పంటలు పండే అవకాశం లేకుండా పోయింది.

కార్పొరేట్ల కోసం ఉప్పు భూములు!

సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాంతంలో ఉన్న ఉప్పు భూములను కార్పొరేట్లకు అప్పగించాలని ప్రభుత్వం చూస్తోంది. మూలపేట పోర్టుకు ఆనుకుని పది వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతేడాది అక్టోబరు 31న ఈదుపురంలో నిర్వహించిన సభలో ప్రకటించారు. తర్వాత అందుకు సంబంధించి డ్రోన్ సర్వే సైతం జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని భూములను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వమే ఈ భూములను గుజరాత్‌కు చెందిన ఓ కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టాలనే ఆలోచనతో 2016 నుంచి ఉప్పు భూముల ఆటో రెన్యువల్‌ను ఆపేసింది. 2016 నుంచి ఇక్కడ ఉప్పు ఉత్పత్తి నిలిచిపోయింది.

రూ.570 కోట్ల మేర సంపదకు గండి

ఏటా రెండు పంటలు పండే పచ్చని భూములను బలవంతంగా లాక్కోవడంతో వ్యవసాయం, ఉద్యాన పంటల ఉత్పత్తుల ద్వారా సమకూరాల్సిన ఆదాయానికి గండిపడింది. భూములు సేకరించిన ప్రాంతాల్లో రైతులు వరి, పెసర, మినుము పంటలు పండించేవారు. మత్స్య సంపద కూడా దొరికేది. ఈ ప్రాంతంలో ఎకరాకు 20 క్వింటాళ్ల వరి దిగుబడి వస్తుంది. దీనిని, ఇతర పంటల దిగుబడిని కలుపుకుంటే భూములు ఖాళీగా ఉన్నప్పటి నుంచి ఇంతవరకూ రూ.570 కోట్ల మేర ఉత్పత్తులను కోల్పోవాల్సి ఉంది. భూములను కోల్పోయి రైతులు, ఉపాధి కోల్పోయి వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు వలసబాట పట్టారు.

దేని కోసం	ఇచ్చిన భూమి (ఎకరాల్లో)
ఈస్ట్‌కోర్టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్	2,640
నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ	1,545
అణువిద్యుత్ ప్రాజెక్టు	2,079
ఫార్మా పరిశ్రమల కోసం	1,200

4 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పు, ఈశాన్య గాలుల ఫలితంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం ప్రకాశం, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణ కోస్తా తీరం వెంబడి 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

విద్యుదాఘాతంతో ఇద్దరు వలస కార్మికులు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

పొట్టకూటి కోసం వలస వచ్చిన బీహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు విద్యుదాఘాతానికి గురై మరణించారు. ఈ విషాదకర సంఘటన బుధవారం అన్నమయ్య జిల్లా పిటిఎం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండలం బిళ్లూరువాండ్లపల్లెకు చెందిన ఆవుల రాజశేఖర్... పిటిఎం మండలం, కందుకూరులో గత కొంతకాలంగా సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇంద్రసేన్ సహని (45), గుడ్డు సహని (32) ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే ఎలక్ట్రికల్ మిషన్‌లో ఇటుకలు తయారు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఫ్యాక్టరీ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమిష్టి కృషి వల్లే రాష్ట్రానికి గూగుల్

- నవంబరులో కీలక ప్రకటనలు
- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమిష్టి కృషి వల్లే రాష్ట్రానికి గూగుల్ వచ్చిందని, చరిత్ర సృష్టించాలన్న చరిత్రను తిరగరాయాలన్నా సిఎం చంద్రబాబుకే సాధ్యమని ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి వల్ల రాష్ట్రానికి హానికరమన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు ఇండియా లార్జెస్ట్ ఆటోమోటివ్ ఎఫ్‌డిఐ కియో తెచ్చారని, నేడు ఆ చరిత్రను తిరగరాస్తున్నామన్నారు. ఇండియా సింగిల్ లార్జెస్ట్ ఎఫ్‌డిఐ ఇన్వెస్టిమెంట్ ఇన్ హిస్టరీ, ఎపిలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుందని తెలిపారు. అమెరికా వెలుపల గూగుల్ లార్జెస్ట్ డేటా సెంటర్ ఇదేనన్నారు. విశాఖ రూపురేఖలు మార్చబోతోందన్నారు. గూగుల్ పెట్టుబడి వల్ల 1.88 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయన్నారు. గూగుల్ కోసం చట్టాల్లో సవరణలు చేశామన్నారు. ఐటి సెక్రటరీ భాస్కర్, కార్తికేయ మిశ్రా వంటి అధికారులు ఈ ప్రాజెక్టు కోసం గ్రౌండ్ వర్క్ చేశారని తెలిపారు. నవంబరులో మరికొన్ని కీలక ప్రకటనలు ఉంటాయన్నారు. మేకిన్ ఇండియా పాలసీపై ప్రధాని సీరియస్‌గా పనిచేస్తున్నారని, పరిశ్రమల కోసం ఇతర రాష్ట్రాలతో పోటీపడటంలో తప్పులేదన్నారు.

పంచాయతీల పునర్ వ్యవస్థీకరణతో మెరుగైన సేవలు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీల పునర్ వ్యవస్థీకరణతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం సమావేశమయ్యారు. పంచాయతీ పరిపాలనా వ్యవస్థలో పునర్ వ్యవస్థీకరణ చేపట్టడంపై పవన్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. 4 గ్రేడ్ల వ్యవస్థ కచ్చితంగా గ్రామీణ ప్రజలకు మేలు చేస్తోందని తెలిపారు. రూర్బన్ పంచాయతీలు గుర్తించి వాటిలో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. స్థానిక పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలు క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సిబ్బందే కీలకపాత్ర అని పేర్కొన్నారు. పంచాయతీలను 4 గ్రేడ్‌లుగా విభజించడం వల్ల 10 వేలమంది ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు లభిస్తాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

సెకండరీ హెల్త్ డైరెక్టరుగా చక్రధర్‌బాబు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సెకండరీ హెల్త్ నూతన డైరెక్టరుగా కెవిఎస్ చక్రధర్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.. సెకండరీ హెల్త్‌లోని అన్ని జిల్లా, ప్రాంతీయ, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సేవలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజలకు సమర్థవంతమైన వైద్య సేవల అందుబాటు, సేవల అమలు, వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడమే తన ప్రధాన ప్రాధాన్యతలుగా పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల అమలులో వైద్య సిబ్బంది చురుకైన భాగస్వామ్యంతో సెకండరీ హెల్త్ ఆస్పత్రులు మరింత సమర్థంగా సేవలందించేలా చర్యలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి బిసికె నాయక్, సెకండరీ హెల్త్ డైరెక్టరు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం దృష్టికి విద్యార్థుల సమస్యలు

- కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాపు, బలిజ, తెలగ, ఒంటరి తరగతుల విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు తెలిపారు. విదేశీ విద్యా దీవెన పథకం కింద అర్హులై ఉన్నత విద్యనభ్యసించేందుకు విదేశాలకు వెళ్లిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి తరగతులకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి సుబ్బరాయుడును బుధవారం కలిసి పలు సమస్యలను వివరించారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యశిస్తున్న తమ పిల్లలకు విడుదల చేయాల్సిన విదేశీ విద్య ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయించాలని కోరారు.

జిఎస్‌టి పేరుతో ప్రజలపై రూ.55.44 లక్షల కోట్లు భారం

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిఎస్‌టి పేరుతో 2017 నుంచి 2025 వరకూ ఎనిమిదేళ్ల కాలంలో ప్రజల నుంచి రూ.55,44,897 కోట్లు కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేసిందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. ఇప్పుడు జిఎస్‌టి 2.0 పేరుతో తగ్గించింది కేవలం రూ.2.50 లక్షల కోట్లు అని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్యుల నడ్డి విరిచిన మోడీ.. గోరంత పన్ను తగ్గించి కొండంత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. జిఎస్‌టి తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందనేది పచ్చి అబద్ధమన్నారు. ఉత్సవాల పేరిట సభలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. కర్నూలులో గురువారం నిర్వహించే సభకు 7 వేల బస్సులు, 5 లక్షల మంది జన సమీకరణ చేస్తున్నారని, ప్రజల సొమ్ముతో మోడీ సొంత భజన చేయడానికి కూటమి ప్రభుత్వానికి తగునా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరగాలంటే కావాల్సింది ప్రత్యేక హోదా అని పేర్కొన్నారు.

సుగాలి ప్రీతిభాయ్ కేసులో న్యాయం చేయాలి

- కర్నూలు కలెక్టరేట్ ఎదుట తల్లిదండ్రుల నిరసన
- సిపిఎం, కెవిపిఎస్ సంఘీభావం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సుగాలి ప్రీతిభాయ్ కేసులో న్యాయం చేయాలని కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆమె తల్లిదండ్రులు బుధవారం నిరసన తెలిపారు. ఎనిమిదేళ్లయినా ముద్దాయిలకు ఎలాంటి శిక్ష పడలేదని ప్రీతిభాయ్ తల్లి పార్వతీబాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా ఆయనను కలిసి మాట్లాడే అవకాశం ఇవ్వాలని ప్రీతిభాయ్ తల్లిదండ్రులు కోరారు. ప్రధాని అపాయింట్‌మెంట్ రానందున వారు నిరసన తెలిపారు. నిరసనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. మోడీ గో బ్యాక్ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రీతిభాయి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరసన దీక్షకు కెవిపిఎస్ ప్రతినిధి బృందం సంపూర్ణ మద్దతు తెలిపింది.

'మేఘా' కృష్ణారెడ్డి మాతృమూర్తికి ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు

కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత పురిటిపాటి కృష్ణారెడ్డి మాతృమూర్తి విజయలక్ష్మికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈనెల ఐదున విజయలక్ష్మి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. సంస్మరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగింది. ఎపి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, తెలంగాణ సిఎం ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, బండి సంజయ్, పలువురు ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన అధికార, అనధికార ప్రముఖులు మేఘా సంస్థ అధికారులు, సిబ్బంది హాజరై నివాళులర్పించారు. తొలుత ఆమె భర్త పి.వీరారెడ్డి, కుమారులు ఎంఇఐఎల్ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.కృష్ణారెడ్డి, సిఇఒ పి.వి.సుబ్బారెడ్డి, కుమార్తె ప్రసన్న, సోదరుడు, ఎంఇఐఎల్ చైర్మన్ పి.పి.రెడ్డి, కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68